# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :174 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 08-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆయిల్ ఫామ్ రైతులకు న్యాయం చేయాలి..

హైదరాబాద్,ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి తెలంగాణ ఆయిల్ ఫామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆలపాటి రామచంద్ర ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులకు కనీసం మద్దతు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.గతంలో టన్ను 20వేల రూపాయలు ఉండగా.. ఇటీవల కాలంలో కష్టం డ్యూటీని ఎత్తివేసారని తెలిపారు. కష్టం డ్యూటీని తగ్గించిన క్రమంలో టన్ను ధర 12 వేల రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల తమకు గిట్టుబాటు కావడం లేదని పేర్కొన్నారు. కనీసం మద్దతు ధర రూ.20,000లు ఉండేలా చూడాలని కోరారు.అదేవిధంగా తెలంగాణకు కోకోనట్ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్ ను అశ్వారావుపేట (ట్రైబల్, నాన్ ట్రైబల్ శిక్షణ)లో ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఖైరతాబాద్ గణేషుడి తొలిపూజలో పాల్గొన్న సీఎం రేవంత్..



హైదరాబాద్: ఖైరతాబాద్ గణేశుడు సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమిస్తున్నారు. 70 ఏండ్ల ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో తొలిసారిగా 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పైన మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామి వారికి రెండు వైపుల అయోధ్య శ్రీబలరాముడు, రాహు, కేతులతో పాటు శ్రీ లక్ష్మీ శ్రీనివాసుడు, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను భక్తులకు కనువిందు చేస్తున్నారు.ఖైరతాబాద్ బడా గణేశుడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారి స్వామివారి తొలిపూజలో ఉంటుంది. అన్నంతరం మాట్లాడుతూ.. 70 ఏండ్ల నుంచి దేశం దృష్టినంతా ఆకర్షించేలా వినాయకుడి ఉత్సవాలను ప్రకటించారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు తెలంగాణకే గర్వకారణమని చెప్పారు. నిష్టతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ద్వారా శాంతి, మతసామరస్యం, పాడిపంటలతో రాష్ట్రం వర్ధిల్లుతుందని తెలిపారు.ప్రభుత్వం గణేష్ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని చెప్పారు. హైదరాబాద్‌లో 1.40 లక్షల గణేషుడి విగ్రహాలను నెలకొల్పారని, మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. అకాల వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భారీ వరదలు వచ్చినప్పటికీ తక్కువ నష్టంతో బయటపడ్డామని. కాగా, సీఎం రేవంత్ వేదికపై ఉన్నప్పుడే వినాయకుడికి ఉన్న గజమాల ఒక్కసారిగా తెగిపడింది. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన వినాయకుడి పూజలో సీఎం రేవంత్ ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ దంపతులు కూడా ఉన్నారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతికి ప్రతి ఏడాది గవర్నర్ తొలిపూజ నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ ఏడాది మొదటి సారి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిపూజకు హాజరుకానున్నారు. సాయంత్రం 3గంటల ప్రాంతంలో తెలంగాణ గవర్నర్ హాజరవుతారని ఉత్సవ కమిటీ.

## పాక్ తో చర్చల్లేవ్ తేల్చేసిన అమిత్ షా.. అలా ఎందుకు చెప్పారంటే?

న్యూఢిల్లీ,కంద్ర హెూం మంత్రి అమిత్ షా కుండ బద్దలు కొట్టేశారు. శషబిషలు లేకుండా పాకిస్తాన్ విషయంలో తమ అభిప్రాయాన్ని నిర్మోహమాటంగా వెల్లడించారు. జమ్ముకశ్మీర్ లోని మిగిలిన పార్టీలకు భిన్నంగా తమ విధానాల్ని.. తమ ఎన్నికల ప్రణాళికను చెప్పేశారు. అంతేకాదు.. ఆర్టికల్ 370 రద్దు అన్నది ఒక ముగిసిన అధ్యాయమని.. దాన్ని ఎవరూ వెనక్కి తీసుకురాలేరని చెప్పిన ఆయన.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేవారు.ఉగ్రవాదం అంతమయ్యేవరకు పాక్ తో చర్చలు ఉండవన్న అమిత్ షా.. 'చర్చలు.. బాంబులు ఒకేసారి కొనసాగవు. ఉగ్రవాదం అంతమయ్యే వరకు పాక్ తో చర్చలు జరిపేందుకు మేం అనుకూలం కాదు. కశ్మీర్ యువతతో మేం కచ్చితంగా మాట్లాడి తీరతాం" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ ఎన్నికల మేనిఫెస్టోను సంకల్ప్ పత్ర పేరుతో విడుదల చేశారు. ఉగ్రవాదాన్ని.. వేర్పాటువాదాన్ని తుడిచిపెట్టటం మేనిఫెస్టోలో మొదటి అంశంగా పేర్కొన్నారు.మహిళల ఆర్థిక భద్రత.. స్వావలంబనకు అధిక ప్రాధాన్యం ఇస్తూనే.. శాంతియుత.. సురక్షిత.. సుసంపన్నమైన జమ్ముకశ్మీర్ సాధించుకోవటమే తమ మేనిఫెస్టో లక్ష్యంగా పేర్కొన్నారు. ' స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జమ్ముకశ్మీర్ కు బీజేపీ ప్రాధాన్యత ఇస్తూనే ఉంది. ఈ నేలను చెక్కు చెదరకుండా ఉంచేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది. 2014 వరకు జమ్ముకశ్మీర్ వేర్పాటువాదం.. ఉగ్రవాదం నీడలో ఉండేది. పలువురు నాయకులు రాష్ట్రంలో అస్థిరతను క్రియేట్ చేశారు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయి" అని పేర్కొన్నారు.2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత రాష్ట్ర హెూదా కోల్పోయి కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి అసెంబ్లీ ఎన్నికలు జరగటం ఇదే తొలిసారి. 2014లో చివరిసారి ఈ రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. అనంతరం పీడీపీతో



పొత్తు పెట్టుకున్న బీజేపీ.. జమ్ముకశ్మీర్ లో కూటమి ప్రభుత్వాన్నిఏర్పాటు చేయటం తెలిసిందే. ఆ తర్వాత వారి ప్రయాణం ఎక్కువ కాలం సాగలేదు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారటం.. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరగటం ఇదే తొలిసారి.మొత్తం 90 అసెంబ్లీస్థానాలున్న జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు మూడు దశల్లో జరగనున్నాయి. తొలిదశలో 24 అసెంబ్లీ స్థానాలకు.. రెండు, మూడు దశల్లో వరుసగా 26స్థానాలు.. 40 స్థానాలకు పోలింగ్ జరగనుంది. సెప్టెంబరు 18న తొలి విడత.. సెప్టెంబరు 25న రెండో విడత.. అక్టోబరు 1న మూడో విడత పోలింగ్ ను నిర్వహించనున్నారు. అక్టోబరు 8న ఫలితాలు వెల్లడి కానున్నాయి. బీజేపీ మేనిఫెస్టో విడుదల వేళ అమిత్ షా నోటి నుంచి ఆసక్తికర వ్యాఖ్య ఒకటి వచ్చింది. "జమ్ముకశ్మీర్ చరిత్ర గురించి రాసినప్పుడు 2014 తర్వాత 10 ఏళ్ల కాలం గోల్డెన్ పీరియడ్ గా మిగిలిపోతుంది" అని పేర్కొన్నారు. మరి.. జమ్ముకశ్మీర్ ప్రజలు ఈ ఎన్నికల్లో ఎలాంటి తీర్పు ఇవ్వనున్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందని చెప్పక తప్పదు.

## బిట్‌కాయిన్ పేరుతో దగా.!!

నిర్మల్ : చట్టబద్ధత లేని యూబిట్ కాయిన్ చైన్ వ్యాపారం కలకలం రేపుతోంది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సూత్రధారులుగా వ్యవహరిస్తూ అమాయకులను బలి చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం అందిన ఫిర్యాదుల మేరకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక చొరవ తీసుకొని ఈ యూబిట్ కాయిన్ చైన్‌దందా గుట్టును రట్టు చేశారు.

పలువురు ఏజెంట్లను అరెస్టు చేశారు. ఓఎక్సైజ్ ఎస్సైతో పాటు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, కానిస్టేబుల్ మరో ఇద్దరు టీచర్లు వందల మందిని ఈ దందాలో రూ.లక్షల పెట్టుబడులు పెట్టించారని విచారణలో తేలింది. గొలుసుకట్టు పద్ధతిలో ఈ దందాను కొనసాగిస్తున్నారు. మొదట రూ. 50వేల పెట్టుబడి పెట్టిన వారికి డాలర్లరూపంలో కాయిన్‌లు వస్తాయి.

ఈ పెట్టుబడికి ప్రతీ నెల వడ్డీ రూపంలో వీరి ప్రత్యేక ఖాతాలో జమ అవుతున్నట్లు చూపుతున్నారు. దీంతో పాటు సభ్యులు మరో ఐదుగురిని చేర్పిస్తే వారికి మరింత ఆదాయం వస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పించిన వారికి యూబిట్ కాయిన్ సంస్థ స్టార్ రేటింగ్‌లు ప్రకటిస్తుండటం విశేషం. ఫైవ్ స్టార్ పొందిన వారు ఈ దందాలో సీనియర్లుగా చెలామణి అవుతూ జిల్లా అంతటా సభ్యులను చేర్పించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, కామారెడ్డి లాంటి పట్టణాల్లో కూడా వీరు నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు చెబుతున్నారు. అయితే ఈ చైన్ దందాలో చివరకు ఎవరు చెల్లింపులు చేస్తారనే విషయంపై స్పష్టత లేకున్నా.. అమాయకులు రూ.లక్షలు పెట్టుబడి పెడుతున్నారు.



ఉద్యోగులను నమ్మి పెట్టుబడులు..

నిర్మల్ జిల్లాలోని కడెం మండలానికి చెందిన టీచర్లు, ఓ కానిస్టేబుల్‌తో పాటు నిర్మల్‌కు చెందిన ఓ ఎక్సైజ్ ఎస్ఐ ఈ దందాకు సూత్రధారులుగా ఉన్నట్లు తేలింది. ఫిర్యాదులు రావడంతో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సూత్రధారుల సెల్‌ఫోన్లు, ఆర్థిక కార్యకలాపాలపై నిఘా పెట్టారు. దీంతో గుట్టు రట్టయ్యింది. వీరితో పాటు మరో 40మంది టీచర్లు కూడా వందల మందిని సభ్యులుగా చేర్పించి వారిచేత రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టించారని తెలుస్తోంది. అయితే ఈ పెట్టుబడులన్నీ తిరిగి రావడం కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

స్టేట్ సైబర్ క్రైం ఆరా..

నిర్మల్‌లో పెద్ద ఎత్తున కొనసాగుతున్న యూబిట్ కాయిన్ దందాపై రాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు నిఘా పెట్టినట్లు సమాచారం. నిర్మల్ ఎస్పీ పంపిన నివేదిక ఆధారంగా సైబర్ క్రైం ఉన్నతాధికారులు కొద్ది రోజుల్లోనే రంగంలోకి దిగి ఈ దందాపై ఆరా తీయనున్నట్లు సమాచారం.

## విజయవాడలో మళ్లీ టెన్షన్..



విజయవాడ :విజయవాడలో వచ్చిన వరదలు వారం రోజులపాటు అక్కడి ప్రజలు నిద్ర లేకుండా చేశాయి. రాత్రికిరాత్రి చుట్టుముట్టిన వరదలతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు తరలాల్సి వచ్చింది. బుడమేరు వరద విజయవాడలో ఈ ప్రళయానికి కారణమైంది.గతవారం భారీ వరదలతో కండ్రిగ, నున్న, వాంబే కాలనీ సహా ఆ చుట్టుపక్కల కాలనీలు వరదలో చిక్కుకుపోయాయి. ఈ వరదలకు కారణమైన బుడమేరు పేరు వింటేనే ఇప్పుడు అక్కడి ప్రజలు వణికిపోతున్నారు. బెజవాడ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వచ్చిన భారీ వరదలతో ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. ఇంకా ఆ వరద నుంచి ఆ ఇళ్లను వీడనే లేదు.అయితే.. విజయవాడను ఇప్పుడప్పుడే వరదలు వీడేలా కనిపించలేవు. వర్షాలు తగ్గుముఖం పట్టాయి, వరదలు తగ్గుముఖం పట్టాయి.. మరోసారి వర్షాలు భయపెడుతున్నాయి. తాజాగా మరోసారి నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో జనం మళ్లీ ఆందోళనలో పడింది.తాజాగా.. సింగ్‌నగర్, విద్యాధరపురం, భవనీపురం, రాజరాజేశ్వరిపేట, రూరల్ పరిధిలో అంబాపురం, జక్కంపూడి కాలనీ, రాయనపాడు, నైనవరంతోపాటు పలు గ్రామాల్లో అడుగు నుంచి రెండడుగుల మేర నీరు పెరిగింది. దీంతో మరోసారి ప్రజల్లో భయాందోళన మొదలైంది. అయితే.. వెలగలేరు హెడ్ రెగ్యులేటరీ పరిధిలో ఎలాంటి వరద లేదని తేలడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు.అటు.. కృష్ణా జిల్లా పరిధిలోని బుడమనేరు మాత్రం మరోసారి ఉగ్రరూపం దాల్చింది. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో



తగ్గిన వరద.. గుడివాడ, నందివాడ, మండపల్లి మండలాల్లో ఉధృతమైంది. దీంతో అక్కడి ప్రజలు మరోసారి తలదాచుకునేందుకు పరుగులు పెట్టారు. ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు వరదతో ముంచెత్తాయి. దేవుడా.. మొన్న వచ్చిన వరదలతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని, మరోసారి మాకు ఈ పరీక్ష ఏంటని జనం ఆందోళనలు చేస్తున్నారు.

విజయవాడ ఊపిరి పీల్చుకో మూడు గండ్లు పూడ్చివేత

విజయవాడ : బుడమేరుకు పడ్డ గండ్లను పూడ్చే పనులను పూర్తి అయ్యాయి.. 24 గంటల పాటు నిర్విరామంగా శ్రమించిన ఆర్మీ అధికారులు, గండి పూడ్చవేత నిపుణులు, ఇతర సిబ్బంది కలసి దిగ్విజయంగా మూడో గండిని కొద్ది సేపటిక్రితం పూడ్చివేశారు.. దీంతో విజయవాడలోకి ప్రవేశిస్తున్న వరద నీరుకు అడ్డుకట్టపడింది. ఆర్మీ సాయంతో మూడో గండి పూడ్చివేత పనులను అ గాబీయన్ బాస్కెట్ విధానంలో పూర్తి చేశారు..గాబీయన్ బాస్కెట్ విధానం అంటే ఇనుప జాలీల్లో రాళ్ళను నింపి గండి పూడ్చివేత విధానమే అని అధికారులు వెల్లడించారు. ఒక్కొక్కొ బాస్కెట్ 522 మీటర్ల పరిమాణం గల గాబియన్ బాస్కెట్‌లను తొలుత ఒకదానిపై ఒకటి పేర్చి వాటిల్లో నింపి గండికి అడ్డుకట్టగా వేశారు.. 100 మీటర్లు ఉన్న మూడో గండిలో 40 మీటర్లు శుక్రవారమే అధికారులు పూడ్చారు. ఇవాళ మిగతా 60 మీటర్లు పూడ్చివేసి వరద నీటిని అడ్డుకున్నారు.. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో గండిని పూడ్చే పనులను ఒకవైపు ఏజెన్సీలు చేస్తుంటే చెన్నైకి చెందిన 6వ బెటాలియన్, సికింద్రాబాద్‌కు చెందిన రెజిమెంటల్ బెటాలియన్ జవాన్లు దాదాపు 120 మంది పాల్గొని బుడమేరు గండ్లను పూడ్చివేశారు..

## మౌనమే కేసీఆర్ భాష.. గులాబీ పార్టీకి వరమా? శాపమా?




హైదరాబాద్,అదే పనిగా మాట్లాడే వారితో ఇబ్బంది. మితంగా మాట్లాడే వారితోనూ కొంత ఇబ్బంది ఉంటుంది. ఇదంతా సాదాసీదా ప్రజల వరకు ఓకే. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన అధినాయకుడు మౌనంగా ఉండటం ఎలాంటి సంకేతాల్ని పంపుతోంది? ఎవరికేమైనా ఫర్లేదు.. తాను మాత్రం మాట్లాడే ప్రసక్తే లేదన్నట్లుగా వ్యవహరించే ధోరణి గులాబీ పార్టీని దెబ్బ తీయనుందా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది.అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టే వేళలో అసెంబ్లీకి హాజరైన తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నేత.. అసెంబ్లీ సమావేశం తర్వాత మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. ఆ సందర్భంగా ఆయన కొన్ని వ్యాఖ్యలు చేశారు. కట్ చేస్తే.. ఇప్పటివరకు మళ్లీ మాట్లాడింది లేదు. ఆ మాటకు వస్తే.. ప్రజల ముందుకు కానీ.. మీడియా ముందుకు కానీ వచ్చింది లేదు. ఇదిలా ఉంటే.. గడిచిన కొన్ని నెలలుగా ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. కానీ.. వేటి మీదా కేసీఆర్ స్పందించింది లేదు. ఆయనేం మాట్లాడతారన్న ఆసక్తి తెలంగాణ ప్రజల్లో వ్యక్తమవుతోంది.అయితే.. ప్రతి దానికి ఒక పరిమితి ఉంటుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. అందుకు గులాబీ బాస్ కేసీఆర్ సైతం మినహాయింపు కాదు. ఆయన మౌనంగా ఉండటం వ్యూహంలో భాగం కావొచ్చు. కానీ.. అవసరమైనప్పుడు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు.. ప్రభుత్వం ఏదైనా అంశాల్లో ఫెయిల్ అయినప్పుడు బయటకు వచ్చి.. ప్రభుత్వాలకు చురుకు తగిలేలా మాట్లాడాల్సిన బాధ్యత గులాబీ బాస్ మీద ఉంటుంది. కానీ.. అవేమీ పట్టించుకోకుండా తాను.. తన ఫామ్ హౌస్ కే పరిమితం కావటాన్ని పలువురు తప్పు పడుతున్నారు.గతాన్ని పక్కాన పెడితే.. గడిచిన వారం.. పది రోజులుగా ఖమ్మం.. నల్గొండ జిల్లాల్లో చోటు చేసుకున్న భారీ వర్షాలు, ఆ సందర్భంగా విరుచుకుపడిన వరదల కారణంగా లక్షలాది ప్రజల బతుకులు ఆగమాగం అయ్యాయి. మొదటి రెండు రోజులు సహాయక చర్యల విషయంలో ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందన్న వాదనను గులాబీ దండు తెర మీదకు తీసుకొచ్చింది. ఒకవేళ.. అదే నిజమని అనుకుంటే.. అలాంటప్పుడు గులాబీ బాస్ తెర మీదకు వచ్చి.. సహాయక చర్యల కోసం తపిస్తున్న ప్రజలను కేసీఆర్ పరామర్శించటం లాంటివి చేసి ఉంటే ఎలా ఉండేది? అన్నది ఇప్పుడు చర్చగా మారింది.ఓవైపు కేసీఆర్ ఫామ్ హౌస్ కు పరిమితమైతే.. మరోవైపు ఆయన కుమారుడు కమ్ మాజీ మంత్రి కేటీఆర్ అమెరికాలో ఉండిపోవటం.. వరదల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న విషయంపై క్లారిటీ వచ్చిన తర్వాతైనా.. ప్రజల కోసం తన టూర్ ను క్యాన్సిల్ చేసుకొని వచ్చేసి ఉంటే బాగుండేది. కానీ..అలాంటిదేమీ చేయకుండా తన టీంతో అదే పనిగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టటం వల్ల ప్రయోజనం ఉండదన్న విషయాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది అంటున్నారు.అవేమీ పట్టనట్లుగా వ్యవహరించే కేసీఆర్ తీరు తెలంగాణ ప్రజల మనోభావాల్ని తీవ్రంగా గాయపర్చినట్లుగా పలువురు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు.. వారికి ఎలాంటి సాయం అందించాలన్న దానిపై స్పష్టత ఉండాలే తప్పించి.. ఎక్కడో దూరాన ఉండిపోయి.. అక్కడి నుంచి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేయటం ద్వారా కొంత బజ్ క్రియేట్ చేయటం బాగుంది. అదే సమయంలో గ్రౌండ్ లోనూ అంతేలా పనులు చేసేందుకు వీలుగా గులాబీ సైన్యాన్ని పంపి ఉంటే మరింత మైలేజీ ఉండేదంటున్నారు. అందుకు భిన్నంగా ఉండటం కచ్చితంగా డ్యామేజే అన్న మాట బలంగా వినిపిస్తోంది.

## హైదరాబాద్‌లోనేటి నుంచి 10 రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్: వినాయకచవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. మరికొన్ని గంటల్లో గణనాథులు మండపాల్లోకి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఖైరతాబాద్‌లో బడా గణేష్‌తోపాటు హైదరాబాద్ నగరవ్యాప్తంగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు తెలిపారు.శనివారం నుంచి ఈ నెల 17వ తేదీ నిమజ్జనం అర్ధరాత్రి వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు.ముఖ్యంగా ఖైరతాబాద్ వినాయకుని పరిసర ప్రాంతా లు ట్యాంక్ బండ్,నెక్లెస్‌రోడ్,మింట్‌కాంపౌండ్‌లో ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు.

## రేవంత్ తో కొత్త పీసీపీ చీఫ్ మహేష్ కుమార్ భేటి

హైదరాబాద్: పార్టీలో సీనియర్లు, జూనియర్లు అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మహేష్ గౌడ్ ఇవాళ (శనివారం) మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.హైదరాబాద్ జూబ్లీహిల్స్?లోని రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మహేష్ గౌడ్.. సీఎంతో భేటీ అయ్యి తన ఎన్నికకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కొత్త బాస్?గా ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్?ను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని.. ఇందుకు తన నియామకమే నిదర్శనమని ఉదహరించారు. త్వరలోనే పార్టీలో పదవుల భర్తీ ఉంటుందన్న మహేష్ గౌడ్.. పార్టీని నమ్ముకుని ఉన్నవారికి తప్పక న్యాయం జరుగుతోందని చెప్పారు.ప్రభుత్వంతో పార్టీని సమన్వయం చేయడం పీసీసీ చీఫ్?గా నా ముందున్న బిగ్ టాస్క్ అని అన్నారు. పీసీపీ చీఫ్ కోసం



చాలా మంది పోటీ పడ్డారని.. హైకమాండ్ బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. పీసీసీ సీటు కోసం పోటీ పడిన వారితో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని.. త్వరలో జరగనున్న లోకల్ బాడీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే పీసీసీ చీఫ్ బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు.

## సంపాదకీయం

ఆదివారం 08-09-2024

# దేశవ్యాప్తంగా ఒకే తరహా విద్య ఉండాలి!

మరో రెండు రోజుల్లో అంటే సెప్టెంబర్ 8న ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం జరుపుకుంటాం. అలాగే సెప్టెంబర్ 5న ఘనంగా గురుపూజోత్సవం జరుపుకున్నాం. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించు కున్నాం. ఏటా ఈ రెండు పండగలను ఘనంగా నిర్వహించుకుంటున్నా విద్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయసాధనకు రావడం లేదు. అలాగే విద్యారంగాన్ని పటిష్టం చేయాలన్న ఆలోచన గానీ, జాతీయ విద్యావిధానం ఒకటే ఉండాలన్న సంకల్పం కానీ కనరావడం లేదు. దేశాన్ని కట్టి ఉంచడానికి, సమాజా న్ని, ప్రజలను ఒకే గొడుకు కిందకు తీసుకుని రావడానికి, ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి కేవలం విద్య మాత్రమే దోహదం చేస్తుంది. అలాగే విద్యారంగానికి నిధులు కేటాయింపులు పెంచి ఏకీకృత విద్యావిధానం తీసుకుని రావాలి. మనదేశంలో అనేక విద్యావిధానాలు అమలవుతున్నాయి. ఒక్కో రాష్ట్రం లో పదిరకాల విద్యావిధానాలు ఉన్నాయి. వీటన్నింటినీ సమీక్షించి, దేశవ్యాప్తంగా ఒకే తరహా విద్యా విధానం ఉండేలా చేయాల్సిన అవసరం ఉంది. కులానికో, మతానికో విద్యావిధానం కూడా సరికాదు. ఉపాధ్యాయులను నియమించి వారిని గౌరవించుకోవడమే గాకుండా పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవాలి. నిజానికి అక్షరాస్యతలో దేశం ఇంకా వెనకబడి ఉంది. వెనకబడిన ప్రాంతాలు, గిరిజనప్రాంతాలకు విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను ఏటా సత్కరించుకుంటున్నా.. పాఠశాలలను బలోపేతం చేయడంలో కానీ, ఉపాధ్యాయనియామకాల్లో గానీ శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉన్న స్కూళ్లను మూసేయడం, క్రమబద్ధీకరించడం చేస్తున్నారు. మారుమూల ప్రాంత పిల్లలకు విద్యను నేర్పాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిన స్కూళ్లను క్రమబద్ధీకరణ పేరుతో మూసేయడం పాలకుల దాష్టీకానికి నిదర్శనంగా చూడాలి. ప్రైవేట్ రంగంలో విద్యను ప్రోత్సహించి విద్యావ్యాపారానికి పాలకులే తోడ్పడడం దారుణం. ఒకేదేశం, ఒకే పన్ను, ఒకే చట్టం అంటున్న మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా జాతీయ విద్యావిధానం అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నా అది కూడా సాకారం కావడం లేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రైవేట్ విద్యారంగం బలపడుతోందే తప్ప ప్రభుత్వ విద్యావిధానం పట్టాలెక్కడం లేదు. దీనికితోడు స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, సమస్యలు తిష్టవేసుకు న్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిన పాలకులు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారు. విద్యారంగంలోనూ మనం ముందుకు పోతున్నామని చెప్పడానికి నమ్మడానికి లేదు. స్కూళ్లు ప్రారంభమై నాలుగైదు మాసాలైనా ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్యవైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సబ్జెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. నేటికీ అనేక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందడం లేదు. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని ప్రభుత్కవం భావిస్తున్నా, మరింత వెనకబడి పోవడం ఖాయం. తెలుగుమీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా? అని ఎదురు ప్రశ్న వేస్తున్నా రు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అని మరో ప్రశ్న. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? మరో ప్రశ్న. నిజానికి ప్రభుత్వ విద్యా బలోపేతంగా ఉంటే.. అదీ జాతీయ విధానంగా ఉంటే ఇలాంటి ప్రశ్నలు,మీమాంసలు రావు. దేశమంతా ఒకే విద్యావిధానం రావాలి. ఇకపోతే ప్రాంతీయ భాషల్లో బోధన జరగాల్సిందే. అలాగే దేశానికి ప్రపంచానికి అసవరమైన హిందీ, ఇంగ్లీషల్లో రాటుదేలేలా చేయాలి. ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. నిజానికి మాతృభాష లోనే పిల్లలు వేగంగా అర్థం చేసుకుని విషయ పరిజ్ఞానం పెంపొందించుకోగలరని పరిశోధనలు రుజువు చేశాయి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలం దరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి,వారిని గతంలోలాగా గౌరవించే సంస్కృతిని బలోపేతం చేయాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదా యాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకో వాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తున్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంగ్లీషు నేర్చు కోవడంలో తప్పులేదు. మాతృభాషలో బోధన చేస్తూనే ఇంగ్లీష్, హిందీభాషలు నేర్పితే సరిపోతుంది. ప్రాంతీయ భాషలు ఏదైనా విద్య అన్నది ఒక్కతీరుగానే ఉండాలి. పాఠ్యాంశాలు ఒక్కటిగా ఉండాలి. బోధనా విధానం ఒక్కటిగానే ఉండాలి. అలాగే దేశ చరిత్ర, పరిణామాలు, సమగ్రంగా భవిష్యత్ తరానికి తెలియచేసేలా విద్యావిధానం ఉండాలి. వీటిని గుర్తించి ఏకీకృత విద్యావిధానం కోసం కేంద్ర,రాష్ట్రాలు సమిష్టిగా కృషిచేయాలి. దేశంలో ఎక్కడికి వెళ్లినా ఒకే తరహా విద్య అందుబాటులో ఉంటే ప్రజల్లో ఏకత సాధించగలం.

# అమెరికా వ్యూహానికి ఉక్రెయిన్ బలి



న్యూఢిల్లీ,రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా అగ్ర రాజ్యంగా అవతరించినప్పటి నుండి ఈ 80 సంవత్సరాల కాలంలో వారి ప్రయోజనాలకు అనేక దేశాలు బలయ్యాయి. ఆ వరుసలో ఇప్పటి వంతు ఉక్రెయిన్ అవుతున్నది. అమెరికా నాయకత్వాన గల సైనిక కూటమి నాటో లో చేరనట్లయితే ఉక్రెయిన్‌కు రాగల నష్టమేమీ లేదు. అదే విధంగా చేరినా కలిగే ప్రయోజనమూ లేదు. కానీ అట్లా చేరితే అమెరికాకు లాభం చాలా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే రష్యాను తమ వ్యూహంలో మరింత పెంచవచ్చు. ఇది నెరవేరేందుకే వారు ఏ విధంగానైనా భారత దేశాన్ని ఒత్తిడి చేసి, రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో తటస్థంగా ఉండటం వల్ల తమ పక్షం వహించేందుకు శతవిధాల ప్రయత్నించారు. ప్రధాని మోడీ గత నెల 23న ఉక్రెయిన్ వెళ్ళి అధ్యక్షుడు జెలెన్ స్కీని కలిసినప్పుడు ఇదే ప్రయత్నం మరొకసారి కన్పించింది.కానీ అందుకు ససేమిరా అన్నందుకు మోడీని అభినందించాలి.సమస్యకు పరిష్కారం ఆ రెండు దేశాలు చర్చించుకోవటంలో మాత్రమే ఉందని సూటిగా చెప్పారాయన. యుద్ధం 2022 ఫిబ్రవరిలో మొదలై సరిగా రెండున్నర సంవత్సరాలు అవుతున్నది. రెండు వైపుల కలిసి మృతులు, గాయపడిన వారు కొన్ని లక్షల మంది. నిర్వాసితులైన వారు అంతకు అనేక రెట్లు. గ్రామాలు, పట్టణాలు, ఆస్తులు వివిధ నిర్మాణాల విధ్వంసానికి అంచనాలు అయినా లేవు. రష్యాతో పోల్చితే ఉక్రెయిన్ భూభాగం, జనాభా, ఆర్థిక వ్యవస్థ అన్నీ ఎంతో చిన్నవి. అయినప్పటికీ మంచి వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం ఉన్నందున తన పరిమితిలో తాను బాగానే జీవిస్తున్నది. తగినంత తోడ్పాటు ఉంటే రాగల కాలంలో మరింత బాగుపడగలదు. ఈ యుద్ధానికి ముందు రష్యాకు, దాని పొరుగునే గల ఉక్రెయిన్‌కు మధ్య కొన్ని సమస్యలు ఉండేందుకు, ఆర్థిక వాణిజ్య సంబంధాలు సజావుగానే ఉన్నాయి. అటువంటి స్థితిలో ఉక్రెయిన్‌ను తమ సైనికులలో చేర్చుకుని రష్యాను ఉక్కిబిక్కిరి చేసేందుకు అమెరికా ప్రయత్నాలు సాగించడంతో సమస్య మొదలైంది. ఆ వ్యూహం నుంచి ఆత్మరక్షణకు రష్యా తన ప్రయత్నం తానే చేయడంతో యుద్ధం మొదలైంది. మధ్యలో ఉక్రెయిన్ బలవుతోంది.ఈ నేపథ్యం గురించిన సమాచారం, అవగాహన తగినంత లేనందున, యుద్ధం ఆరంభ దశలో చాలా మందికి రష్యా దాడి ఆశ్చర్యకరంగా తోచింది. ఉక్రెయిన్‌పై సానుభూతి కలిగింది. ఆ సానుభూతిలో తప్పక న్యాయం ఉంది. కానీ, అటువంటి చిన్న దేశాన్ని తన వ్యూహం కోసం పావుగా ఉపయోగించుకుంటున్న అమెరికా గురించి క్రమంగా అర్థమయ్యే కొద్దీ, వాస్తవాలేమిటో అందరికీ తెలిసి రావటం మొదలైంది. కనుక, ఈ యుద్ధం ప్రస్తావన రాగానే ముందు అమెరికాను, యూరోపియన్ యూనియన్‌ను, నాటో కూటమిని వేలెత్తి చూపి దోషులుగా నిలబెట్టడం పెరుగుతున్నది. స్వయంగా అమెరికాకు, యూరప్‌కు చెందిన అమెరికాకు చెందిన మేధావులు, నిపుణులు, మాజీ సైన్యాధికారులు ఒక వైపు, అనేక దేశాధినేతలు మరొక వైపు ఈ విషయంలో, నాటోను నిందిస్తున్నారు. అందువల్ల, మోడీ ఉక్రెయిన్ పర్యటనను, యుద్ధంలో తమ పక్షం వహించాలంటూ జెలెన్ స్కీ చేసిన అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించడాన్ని ఈ నేపథ్యం నుంచి అర్థం చేసుకోవలసి ఉంటుంది. సమస్యను ఉక్రెయిన్, రష్యా కలిసి కూర్చొని పరిష్కరించుకోవాలి తప్ప బయటివారు కాదని మోడీ అన్నమాటకు కూడా తగినంత అర్థం ఉంది. యుద్ధానికి మూలకారణం అమెరికన్లు నాటోను విస్తృతజూడటమని,అందుకు ఉక్రెయిన్ బలవుతున్నదని ఆయనకు బాగా తెలుసు. ఇది కేవలం ఊహాగానం కాదు. లోగడ కొన్ని సార్లు పాశ్చాత్య మీడియా ప్రతినిధులు విదేశాంగ మంత్రి జై శంకర్‌ను యుద్ధం విషయంలో ఇండియా వైఖరి పొరపాటు ఎత్తి చూపినప్పుడు, 'అది మీ యుద్ధం. మాది కాదు. ఏదో ఒక వైఖరి తీసుకోవాలంటూ మమ్మల్ని ఎందుకు ఒత్తిడి చేస్తున్నా' అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు. అది నిజమే. యుద్ధాన్ని పాశ్చాత్య రాజ్యాలు తమ ప్రయోజనాల కోసం సృష్టించాయి. అందుకోసమే కొనసాగుతున్నాయి. ఇండి యా సహా ప్రపంచమంతా తమ వాదనను అంగీకరించి తమ వ్యూహానికి సహకరించాలని ఉంది. గమనించదగినదేమంటే ఈ రోజున ఇతర దేశాధినేతల నోటి వెంట కూడా సరిగా జైశంకర్ తరహా వ్యాఖ్యలు వినవస్తున్నాయి. అమెరికా, యూరపులు తమ ప్రయోజనాల కోసం ఇతర దేశాలను బలి తీసుకోవడం గతం నుంచి జరుగుతూ వస్తున్నట్లే ఉక్రెయిన్ విషయంలో కూడా జరుగుతున్నదని వారు సూటిగా చెబుతున్నారు. కానీ అమెరికా లెక్క చేయటం లేదు.వియత్నాం నుంచి అఫ్ఘానిస్థాన్ వరకు వారు చేసిన యుద్ధాలన్నీ మనకు గుర్తున్నాయి.సరిగ్గా ఇదే సమయంలో గాలిలో జరుగుతున్నదేమిటో చూస్తున్నాం. ఇజ్రాయెల్ వెనుక అమెరికా, యూరప్‌లు లేనప్పటికీ అది సాధ్యమా? అదే అమెరికా కూటమిలో ఉక్రెయిన్ వెనుక పద్ధతి లేనప్పటికీ ఆ సమస్య ఎన్నడో ముగిసేది. బహుశా అసలు తలెత్తేది కాదు. లేదా కనీసం చర్చలతో పరిష్కారం లభించేది. రష్యా ప్రధానంగా కోరుతున్నది ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకోరాదని. అట్లా చేరనందువల్ల పైన అనుకున్నట్లు, ఉక్రెయిన్‌కు కలిగే నష్టం ఆవగింజంతైనా ఉండదు. కనుక అందుకు అభ్యంతరం ఉండకూడదు. కానీ చర్చలు వద్దు, యుద్ధం కొనసాగించాలని, ఎన్నటికైనా రష్యాను ఓడించవచ్చునని, అందుకు అన్ని సహాయాలు అందించడం రెచ్చగొడుతోంది అమెరికా. తమ స్వంత ప్రయోజాలున్నది అందులోనే గనుక. ఇటు ఉక్రెయిన్ నుంచి, అటు గాజా నుంచి అమెరికా కొన్ని వేల మైళ్ల దూరంలో ఉంది. గతంలో వియత్నాం వాలే. అయినప్పటికీ యావత్ ప్రపంచంపై తమ ఆధిపత్యం సాగాలని, ప్రపంచంలోని అన్ని వనరులు, అన్ని మార్కెట్లపై నియంత్రణ తమదే కావాలని కోరుకుంటున్న అమెరికా,యూరప్‌ల చరిత్ర అందరికీ తెలిసినందున ఇక్కడ మళ్లీ రాయనక్కర లేదు. అయితే, 1991లో సోవియట్ యూనియన్ పతనానంతరం తమ నాయకత్వాన ఏర్పడిన ఏకధ్రువ ప్రపంచం, ఇరవయ్యేళ్లు గడిచిన తర్వాత గత పది సంవత్సరాలుగా బలహీనపడటం వారికి ఆందోళనకరంగా మారింది. ఈ పదేళ్ళుగా బహుళ ధ్రువ ప్రపంచం అనే మాట విరివిగా వినవస్తోంది. ఆ దిశలో వివిధ ప్రయత్నాలు జరుగుతున్నాయి. రష్యా, చైనా, ఇండియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా తదితర దేశాల నాయకత్వాన అనేక ఆర్థిక వాణిజ్య అంతర్జాతీయ సంస్థలు ఏర్పడి బలపడుతున్నాయి. పలు ఇతర దేశాలు చేరుతున్నాయి. వాటిని చీల్చేందుకు అమెరికా ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇటీవల, డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీ సృష్టికి కూడా ప్రయత్నాలు మొదలు కావటంతో అమెరికాకు ఆందోళన పెరుగుతోంది. ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో అమెరికా పట్టుదలను ఈ వ్యూహంలో భాగంగా చూడాలి. ఇది భారత ప్రభుత్వానికి బాగానే అర్థమైనట్లు మనకు ఇప్పటికే స్పష్టమవుతున్నది.

# వినాయకుడి పూజ ప్రాచీన సంప్రదాయం

తిరుపతి: వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు కనుక ఆయనకే తొలిపూజ చేయడ ఆచారంగా వస్తోంది. విఘ్నేశ్వరుడు ప్రమథగణాలకు అధిపతి గనుక గణపతి అంటారు. అనేక పేర్లతో అలరారుతున్న గణనాథుడికి ప్రపంచ్యాప్తంగా పూజలు నిర్వహించడం హైందవ సంప్రదాయంలో భాగంగా మారింది. వినాయకుడికి ఎన్నో నామాలు ఉన్నట్లే, ఎన్నో రూపాలు కూడా ఉన్నాయి. వినాయకుడి కథ, వినాయక చవితి పూజావిధానం దాదాపు అందరికీ తెలిసినదే. వివిధ రూపాల్లో కొలువువుదీరే వినాయకుడికి ప్రత్యేక ఆలయాలు కూడా ఉన్నాయి. సికింద్రాబాద్‌లో గణేశ్ ఆలయం ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్లో అలా నాలుగైదు ఆలయాలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఇకపోతే వరసిద్ధి వినాయక ఆలయం చిత్తూరు జిల్లా కాణిపాకం గ్రామంలో ఉంది. వరసిద్ధి వినాయకుడు ఇక్కడ స్వయంభువుగా వెలిశాడు. ఈ ఆలయంలో వినాయకుని విగ్రహం నేటికీ బావిలోనే కనిపిస్తుంది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు తమకు ఇష్టమైన పదార్థాన్ని స్వామివారికి వదిలిపెడితే కోరికలు తీరుతాయని నమ్మకం. అలాగే, కాణిపాకం వినాయకుడు సత్యప్రమాణాల వినాయకుడిగా కూడా ప్రసిద్ధుడు. ఇక్కడ వినాయకుని ఎదుట ప్రమాణం చేసిన వారు సత్యమే పలకాలని, అసత్యం పలికిన వారికి అనర్థాలు తప్పవని కూడా భక్తులు నమ్ముతారు. మహారాష్ట్రలోని ముంబైలో వరసిద్ధి వినాయకుడు కూడా బాగా ప్రసిద్ధి. ఇక్కడ వ్యాపారవేత్తలు తమారాధ్య దైవంగా కొలుస్తారు. కేరళలోని మధుర మహాగణపతి ఆలయం ఒకప్పుడు శివాలయం. పరమశివుడు మదరనాథేశ్వరునిగా ఇక్కడ వెలశాడు. స్వయంభువుగా వెలసిన శివలింగానికి తుళురాజులు ఆలయం నిర్మించారు. మదరు అనే వృద్ధురాలు ఈ శివలింగాన్ని కనుగొనడంతో ఆవె పేరిట ఇక్కడి శివుడు మదరనాథేశ్వరునిగా ప్రసిద్ధి పొందాడని ప్రతీతి. మైసూరు రాజ్యాన్ని పరిపాలించిన టిప్పు సుల్తాను చాలా ఆలయాలపై దాడులు చేసినట్లుగానే ఈ ఆలయంపైనా దాడి చేయడానికి వచ్చాడని చెబుతారు. మూషిక వాహనుడైన వినాయకుడు నెమలి వాహనంపై కనిపించే అరుదైన ఆలయం ఇది. అందుకే ఇక్కడ వెలసిన వినాయకుడు మయూరేశ్వరుడిగా ప్రసిద్ధి చెందాడు. స్థానికులు 'మోరేశ్వర్' అని కూడా అంటారు. మయూరేశ్వరుడు వెలసినందున ఈ క్షేత్రానికి 'మోర్గాంవ్' అనే పేరు వచ్చింది. ఇది మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఉంది.మహారాష్ట్రలో ప్రాచీన వినాయక క్షేత్రాలు ఎనిమిది ఉన్నాయి. వీటిని అష్ట వినాయక క్షేత్రాలని అంటారు. అష్ట వినాయక క్షేత్రాలకు తీర్థయాత్రగా వెళ్లేవారు మోర్గాంవ్‌లోని మయూరేశ్వరుడి దర్శనంతో యాత్రను ప్రారంభించడం ఆనవాయితీ. ఇకపోతే రాజస్థాన్‌లోని రణ్‌థాంబోర్ కోటలో ఉన్న ఈ ఆలయంలోని వినాయకుడిని 'ప్రథమ గణేశ' అని కూడా అంటారు. దేశంలో ఇదే మొట్టమొదటి వినాయక ఆలయంగా భావిస్తారు. ఈ ఆలయంలో వెలసిన త్రినేత్ర గణేశ విగ్రహం దాదాపు ఆరున్నర వేల ఏళ్ల కిందటిదని అంచనా. రుక్మిణీ కృష్ణుల వివాహం జరిగినప్పుడు వారు తొలి ఆహ్వాన పత్రికను ఇక్కడి ప్రథమ గణేశునికే పంపారని స్థలపురాణ కథనం. అప్పట్లో రణ్‌థాంబోర్ కోటపై అల్లాఉద్దీన్ ఖిల్జీ దాడి చేశాడు. మధ్యప్రదేశ్‌లోని పురాతన నగరమైన ఉజ్జయినిలో వెలసిన గణపతి ఆలయం ఇది. శైవక్షేత్రంగా, శక్తిపీఠంగా పేరుపొందిన ఉజ్జయినిలో వెలసిన ఈ గణపతి భక్తుల చింతలను తీర్చుతాడని, అందుకే ఇక్కడి గణపతిని చింతాహరణ గణపతి అని, చింతామణి గణపతి అని కూడా అంటారు. ఈ ఆలయంలోని గణపతి స్వయంభువుగా వెలిశాడు. వృద్ధి, సిద్ధి సమేతంగా భక్తులకు దర్శనమిస్తాడు. ఉజ్జయినిలోని మహాకాలేశ్వరుడిని, మహాకాళిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు మహాకాళేశ్వర ఆలయానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతామన్ గణపతి ఆలయాన్ని కూడా తప్పనిసరిగా దర్శించుకుంటారు. పాండిచ్చేరిలో ఉన్న గణేశాలయం కూడా బాగా ప్రసిద్ధి చెందిందినదే.

# టూరిస్టు హబ్‌లు ,ఐదు లక్షల ఉద్యోగాలు




జమ్మూ:జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 ఓ చరిత్ర అని, ఇది తిరిగి వచ్చే ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు బిజెపి మేనిఫెస్టోను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఆ తరువాత సమావేశంలో మాట్లాడారు. ఆర్టికల్ 370 తరువాత జరుగుతున్న ఈ ఎన్నికలలో ప్రజలు బిజెపిని ఆదరిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. గడిచిన పది సంవత్సరాల కాలం జమ్మూ కశ్మీర్‌తో పాటు దేశ చరిత్ర సువర్ణ అధ్యాయం అయిందని , పలు విధాలుగా ఈ ప్రాంతం శాంతి ప్రగతి సమ్మిళితంగా సాగుతో ఉంది. ఈ ప్రక్రియ మరింత వేగవంతం కావాలంటే , సుపరిపాలన స్థిరంగా విలసిల్లాలంటే ప్రజలు తమ పార్టీకే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18, 25, అక్టోబర్ 1వ తేదీలలో మూడు విడతలుగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. ఈ పార్టీ తరపున ప్రచారాన్ని వేగిరపర్చే బాధ్యతను అమిత్ షా తీసుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఇక్కడ రెండు రోజుల బస కోసం వచ్చారు.ఆర్టికల్ 370 రాజ్యాంగంలో భాగం కాదని, ఇక ముందు కూడా కాబోదని స్పష్టం చేశారు. ఈ అధికరణ దుష్టశక్తులకు ఊతం ఇచ్చింది. యువత చేతిలో రాయి అయింది. వారు దీనిని ఆధారంగా చేసుకుని పంథాను ఎంచుకునే వీలు కల్పించారు. అన్ని వస్తువులు తీసుకునే ఈ ఆర్టికల్‌పై వేటేశామని హోం మంత్రి చెప్పారు. తాను ఈ ఎన్నికలకు నేషనల్ కాన్ఫరెన్స్ అజెండాను చూశామని, ఇందులో పలు ప్రమాదకర అంశాలు ఉన్నాయని చెప్పారు. ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువస్తామని వారు అంటున్నారు. అయితే ఇది తేవడం వారి భ్రమ , కల్ల అని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ఇక్కడి గుజ్జర్లు, బకేవాలాలు, పహాడీ వంటి ఆదివాసీల రిజర్వేషన్ల కోట జోలికి ఎవరిని రానిచ్చేది లేదని, ఈ నేపథ్యంలో తాను ఒమర్ అబ్దుల్లాకు చెపుతున్నానని తెలిపారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో చర్యతో ఉగ్రవాదం పూర్తిగా ఏరివేస్తామని, ఇంకా ఇక్కడ ఉగ్రవాదం ఎవరు తలెత్తడానికి? బాధ్యత వహించాల్సింది ఎవరు? అనేది తెలియచేస్తామని వివరించారు. ఈ కోసం టెర్రరిజంపై శ్వేతపత్రం వెలువరిస్తామన్నారు. ఐదేళ్ల పాటు బిజెపికి ఇక్కడ పాలనా అవకాశం ఉంది, దీనికి ప్రతిగా ఇక్కడికి శాంతి ప్రగతికి బిజెపి గ్యారంటీ ఇస్తుంది.

టూరిస్టు హబ్‌లు , ఐదు లక్షల ఉద్యోగాలు
బిజెపి మేనిఫెస్టోలో కీలక విషయాలు

జమ్మూ వద్ద , కశ్మీర్‌లోని రాజౌరీలో నూతన పర్యాటక కేంద్రాలు (టూరిస్టు హబ్‌లు) ఏర్పాటు , ఐదు లక్షల ఉద్యోగాల కల్పన. ఈ రెండు కీలక విషయాలతో శుక్రవారం బిజెపి ఎన్నికల వాగ్దాన పత్రం వెలువరించింది. పార్టీ ప్రచార నిర్వాహకులు, కేంద్ర మంత్రి అమిత్ షా ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. పర్యాటక రంగం కశ్మీర్‌కు ఆయువుపట్టు. ఈ రంగం బలోపేతానికి అన్ని చర్యలూ తీసుకున్నాను. కశ్మీర్ లోయలో యువతను దృష్టిలో పెట్టుకుని ఐదు లక్షల ఉద్యోగాలకు తగు విధంగా చర్యలు తీసుకుంటామని, దీనిని నిర్థిష్టంగా తమ పార్టీ మేనిఫెస్టోలో తెలిపామని వివరించారు. కశ్మీరీ పండిట్లు నిర్వాసితులసురక్షిత రాకకు బిజెపి పలు కార్యక్రమాలు చేపడుతుందని షా తెలిపారు.టికా లాల్ తప్ విషపిత్ సమాజ్ పురాన్వాస్ యోజన ((టిఎల్‌టివిపివై) ప్రవేశపెడుతామన్నారు. చర్యలకు ముందు ఈ ప్రాంతం స్థాయి ఉగ్రవాదం (మాక్స్ టెర్రరిజం)గా ఉంది. ప్రాంతాన్ని ఇక్కడ, అంతర్జాతీయ శక్తులు ప్రభావితం చేశాయని ఆ తరువాత తాము తీసుకున్న చర్యలతో అమిత్ షా చెప్పారు.

# 2026 కల్లా భోగాపురం పూర్తి

విజయనగరం,భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను ప్రతీ నెలా పరిశీలిస్తామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు అత్యంత ప్రాధ్యాన ఇస్తోందని వివరించారు. 2026, జూన్ కల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి చేసే లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.శుక్రవారం విజయనగరం జిల్లాలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... భోగాపురం ఎయిర్?పోర్టు పనులు ఇప్పటి వరకు 40 శాతం పూర్తయ్యాయని చెప్పారు. ఏపీలో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదురైనా...పట్టుదలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో వలసలు అరికట్టేందుకు ఈ ప్రాజెక్ట్ మంచి అవకాశమని అన్నారు. భూములిచ్చిన రైతులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని అన్నారు.కానీ, బాధ్యతతో ఉండాల్సిన ప్రతిపక్ష నాయకుడు జగన్ రాజకీయం చేస్తున్నారని విమర్శలు చేశారు. అసత్య ప్రచారంతో విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కూడా కాలేదు..ఇంత పెద్ద విపత్తు వచ్చిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

# అదే పెద్ద అడ్వాంటేజ్ ?

అమరావతి,ఏపీలో వైఎస్ జగన్ ధీమా వెనక చాలా కారణాలు ఉన్నాయి. పార్టీని ఎంతో మంది నేతలు వీడిపోతున్నా జగన్ పట్టించుకోకపోవడం వెనక కూడా ఆయనకు ఉన్న వ్యూహాలు ఆయనకు ఉన్నాయని అంటున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ సీట్లు మాత్రమే ప్రజలు కట్టబెట్టారు. అంటే ఆ పార్టీని ప్రతిపక్షంలో కూడా కూర్చోబెట్టలేదు అన్న మాట.ఎక్కడ 151 సీట్లు మరెక్కడ 11 సీట్లు అన్నది అయితే ఉంది. ఇంత ఘోరంగా వైసీపీ ఓడింది కాబట్టి ఆ పార్టీ నిర్వీర్యం అయిపోతుంది అని అంతా అనుకున్నా అది జరిగేలా లేదు. ఏపీ రాజకీయాలలో ఉన్న పరిస్థితులే వైసీపీకి శ్రీరామ రక్షగా మారుతున్నాయి. అంతే కాదు వైసీపీకి సీట్లు అయితే 11 మాత్రమే వచ్చినా ఓట్ల శాతం చూస్తే 40 గా ఉంది.అది వైసీపీకి మరో ధీమాకు కారణం. ఇక చూస్తే అసెంబ్లీలో వైసీపీని ప్రతిపక్ష పాత్ర ఇచ్చి గుర్తించడానికి టీడీపీ కూటమి సరేమిరా అంటోంది. ఆ పార్టీకి ప్రజలే ఆ అవకాశం ఇవ్వలేదు అని అంటున్నారు కూటమి పెద్దలు. దానికి వైసీపీ వాదన వేరేగా ఉంది.ఏపీలో తామే ఏకైక ఆల్టర్నేషన్ కాబట్టి ప్రతిపక్ష పాత్ర తమకే ఇవ్వాలని అంటోంది. దానికి సీట్లతో నంబర్ తో సంబంధం ఏమిటి అని అంటోంది. అసెంబ్లీలో ఉన్నవి నాలుగు పార్టీలు అయితే అందులో మూడు పార్టీలు కూటమిలో ఉన్నాయని కూడా గుర్తు చేస్తోంది వైసీపీ. అలా చూస్తూ ప్రభుత్వాన్ని నిలదీసే విపక్షంగా వైసీపీ మాత్రమే ఉంది కాబట్టి మెయిన్ అపొజిషన్ అయినా లేక అపొజిషన్ అయినా టెక్నికల్ గానే కాదు లాజికల్ గా కూడా తామే ఉంటామని బల్ల గుద్ది మరీ చెబుతోంది.ఈ ఇష్యూ ఇలా ఉండగా అసెంబ్లీ లోపల మాత్రమే కాదు బయట కూడా కూట మికి అసలైన ప్రతిపక్షం వైసీపీనే అని అంటున్నారు. అసెంబ్లీ బయట కాంగ్రెస్ ఉంది, కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. కానీ ఈ పార్టీలకు పెద్దగా బలం లేదు. కాంగ్రెస్ కి క్యాడర్ లీడర్ రెండూ సమస్యగానే ఉన్నాయి. షర్మిల కాంగ్రెస్ చీఫ్ గా ఉన్నా ఒక్క నాయకుడు కూడా వైసీపీ నుంచి ఆ పార్టీలో చేరలేదు అన్నది గమనించాలి.ఇక కేవలం రెండు శాతం మాత్రమే ఓటు షేర్ ని ఇటీవల ఎన్నికల్లో తెచ్చుకున్న కాంగ్రెస్ 2029 నాటికి ఏపీలో అధికారం లోకి వచ్చేంతలా ఎగబాకుతుంది అంటే అది అద్భుతమే తప్ప జరిగేది కాదని అంటున్నారు. వామపక్షాలది అదే పరిస్థితి. దాంతో టీడీపీ కూటమి ప్రభుత్వం మీద ఏ మాత్రం వ్యతిరేకత వచ్చినా దానికి క్యాష్ చేసుకోవడానికి వైసీపీ మాత్రమే గ్రౌండ్ లో రెడీగా ఉంది అని అంటున్నారు.ప్రజాస్వామ్యంలో అసలైన అపొజిషన్ ప్రజలు. వారికి నచ్చకపోతే అధికార పార్టీకి సమీపంలో ఉన్న పార్టీ వైపే మొగ్గు చూపుతారు. తెలంగాణలో చూసుకున్నా అదే జరిగింది. ఎన్నికలకు ముందు వరకూ ఎగిరెగిరి పడిన బీజేపీ తీరా ఎన్నికల వేళకు మూడవ స్థానానికి పడిపోయింది. బీఆర్ఎస్ ని దించాలీ అంటే కాంగ్రెస్ మాత్రమే అసలైన ఆల్టరేషన్ అని జనాలు గుర్తించి ఓటు వేశారు. అధికారంలోకి తెచ్చారు.ఇక కాంగ్రెస్ కి కూడా గ్రౌండ్ లెవెల్ లో బలం ఉండడం ఒక పార్టీలో ఓటు షేర్ ఉండడం వంటివి ఉపయోగపడ్డాయి. ఏపీలో కూడా వైసీపీది అదే పరిస్థితి అని అంటున్నారు. ఈ రోజున వైసీపీ నుంచి ఎంతమంది కూటమిలో చేరినా ఎన్నికల వేళకు పోటీ మాత్రం వైసీపీ కూటమి మధ్యనే ఉంటుంది. టీడీపీ కూటమి మీద జనాలకు మోహం మొత్తినా

## ఐదు రోజుల్లో పదిలక్షల మందికి ఆహారం

అమరావతి,గత ఐదు రోజులుగా సుమారు 10 లక్షల మంది వరద బాధితులకు ఆహారం అందించామని అక్షయపాత్ర విజయవాడ, గుంటూరు ప్రెసిడెంట్ వంశీదాస ప్రభు చెప్పారు. దివీస్ ల్యాబ్, ప్రభుత్వ సహకారంతో రికార్డు స్థాయిలో బాధితులకు ఆహారాన్ని అందించామన్నారు. ప్రభుత్వం ఎప్పుడు, ఎంత అడిగినా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వంశీదాస చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతోనే ఇంత మందికి అందించగలిగామన్నారు. తాము ఎంత ఆహారం వండినా .. దానిని బాధితుల వద్దకు చేర్చడం గొప్ప విషయమన్నారు. అక్షయపాత్ర చరిత్రలో 10లక్షల మందికి ఆహారం అందించడం రికార్డు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని రోజులు చేయమంటే అన్ని రోజులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## గౌరవం ఇవ్వరా?

హైదరాబాద్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిపోయాయి. దళిత ప్రజాప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వరా అన్న చర్చకు తెరలేపాయి. ఇంతకూ జరిగిందేమిటంటే.. వరదముంపు ప్రాంతాల్లో పర్యటనకు వచ్చిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికేందుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వెళ్లారు. మంత్రులకు స్వాగతం పలికేందుకు అనుమతి ఉన్న ఆరుగురిలో వేముల వీరేశం కూడా ఒకరు. అయితే పోలీసులు వేముల వీరేశాన్ని అడ్డుకున్నారు. అసలు వేముల వీరేశంను వారు గుర్తు పట్టలేదు. ఈ సంఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన వేముల వీరేశం.. తోటి నాయకులు సముదాయించినా వినకుండా పోలీసులకు కామన్ సెన్సార్ లేదంటూ వెనక్కు వెళ్లిపోయారు. వేముల వీరేశం ను పోలీసులు అడ్డుకోవడం నాయకులనే కాదు, ప్రజలను కూడా నివ్వెరపరిచింది. జిల్లాలో కూడా పోలీసు అధికారులు తన పట్ల వ్యవహరించిన తీరుపై వైముల వీరేశం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ను కలిసి ప్రివేల్ మోషన్ ఇచ్చారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి భువనగిరి పర్యటన సందర్భంగా వారికి ముందుగా హెలిప్యాడ్ దగ్గరికి పేర్లు నమోదైన ఆరుగురిలో ఒక ఎమ్మెల్యేగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా వెళ్లారు....అయితే అక్కడ అధికారులు వీరేశంను గుర్తుపట్టకపోగా అడ్డుకునే ప్రయత్నం చేశారు....ఈ సంఘటన ప్రజాప్రతినిధులతో పాటూ... సామాన్య ప్రజలను కూడా నివ్వెరపోయేలా చేసింది. దీంతో పోలీసులపై మనస్తాపం చెందిన ఎమ్మెల్యే వీరేశం తోటి నాయకులు సముదాయించినా వినకుండా పోలీసులకు కామన్ సెన్సార్ లేదా వెనక్కు వెళ్లిపోయారు. ఆర్టికల్ 19, 21,194 ప్రకారం... ఎమ్మెల్యే విధులు ఆటంకపరిచి , హక్కులు హరించినందుకు... అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక తనకు జరిగిన అవమానం మరే ఎమ్మెల్యేకూ జరగకూడదన్న ఉద్దేశంతో స్పీకర్ కు ఫిర్యాదు చేసినట్లు వేముల వీరేశం తెలిపారు. ఇదంతా పక్కన పెడితే వేముల వీరేశంపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు దళిత ప్రజాప్రతినిధులపై వ్యవహరించే తీరు అవమానకరంగా ఉంటుందని, వేముల వీరేశం పట్ల పోలీసుల అనుచితంగా ప్రవర్తించడం వెనుక సుధీర్ బాబు ఆదేశాల మేరకు ఉంటాయని ప్రజాప్రతినిధులలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మానుకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ కూడా దళితుల పట్ల సుధీర్ బాబు ప్రవర్తనపై స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా ఆయన కొందరు అధికారులు దళిత ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల పట్ల చాలా చులకనభావంతో వ్యవహరిస్తున్నారని, తమ ఫోన్లను ఆన్సర్ చేయమని, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తమ సూచనలను ఖాతరు చేయరని సూచించారు. అసలు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు దళిత ప్రజాప్రతినిధులతో అనుచితంగా, అగౌరవంతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా వేముల వీరేశం విషయంలో అవమానకరంగా వ్యవహరించిన కింది స్థాయి పోలీసు అధికారులకు అయినా వారికి డ్యూటీలు వేసి, ప్రొటోకాల్ ఆదేశాలు ఇచ్చేది కమిషనరేనని, ఆయన మేరకే వేముల వీరేశంకు ప్రోటోకాల్ ఇవ్వకుండా అవమానించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేముల వీరేశం కూడా స్వయంగా అవే ఆరోపణలు చేశారు. తనకు జరిగిన అవమానానికి రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబే బాధ్యత వహించాలని మీడియా ముఖంగా చెప్పారు. జిల్లాలో ఒకరిద్దరు బడా నేతల కనుసన్నల్లోనే ఒక ప్రణాళిక ప్రకారం ప్రజల్లో వీరేశంను తక్కువ చేసే ప్రయత్నం జరుగుతున్నదన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే అయితే మాకేంటి అన్నట్లుగా కొందరు అధికారులు ఒకరిద్దరు నేతల తీరు ఉందని స్వయంగా వీరేశం వాపోతున్నారు. అయితే ఆ బడానేతలెవరు, కాంగ్రెస్ వారా, వేరే పార్టీకి చెందిన వారా అన్న విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. వీరేశం తన మాట తీరుతో, డైనమిక్ నిర్ణయాలు, ప్రజాసేవ ద్వారా ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆ కారణంగానే ప్రజలలో ఆయన పలుకుబడిని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజకీయ వర్గాలలో టాక్ నడుస్తోంది. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అయినా చర్యలకు ఉపక్రమిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## వ్యాపారస్తులకు సిద్ది వినాయకుడు

ముంబై, వినాయక చవితికి గణపతిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానంగా వ్యాపారవర్గాలు మంగళవారం గణపతికిప్రత్యేక పూజలు చేస్తారు. మహారాష్ట్రలో ఇది మరీ ఎక్కువ. ముంబైలో సిద్ది వినాయకుడికి మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారు. ఎంతో భక్తిగా నమస్కరిస్తూ పూజించే బంగారుకొండ ఆయన. ఈ స్వామి నామాలను గురించి, రూప విశేషాలను గురించి గణేశ ఉత్తరతాపిన్యుపనిషత్తు, బ్రహ్మవైవర్తపురాణం గణపతి ఖండం, గణేశపురాణాలాంటి పురాణాలు, ఉపనిషత్తులు చక్కగా వివరించి చెబుతున్నాయి. నిత్యసిద్ధతత్వమున్న కనుకనే గణేశుడు తొలి పూజలందుకుంటున్నాడు. ఆ స్వామిని కీర్తించటానికి ఎన్నెన్నో నామాలున్నాయి. అయితే వాటిలో ప్రధానంగా ఎనిమిది నామాలు కనిపిస్తున్నాయి. గణేశుడు, ఏకదంతుడు, హేరంబుడు, విఘ్ననాయకుడు, లంబోదరుడు, శూర్పకర్ణుడు, గజవక్త్రుడు, గుహాగ్రజుడు అనేవి ఆ ఎనిమిది నామాలు. విఘ్నాలను ఖండించేవాడు లేదా నశింపచేసేవాడు అనే అర్థంలో విఘ్ననాయక నామం కనిపిస్తుంది. విఘ్ననాయకుడిని గొప్పతనాన్ని గుర్తించిన విష్ణువు, శివుడు ఆయనకు వివిధ మృష్టాన్నాలను నైవేద్యంగా ఇచ్చారు. వాటిని స్వీకరించిన ఆ గణపతి ఉదరం ఎంతో పెద్దదిగా అయింది. ఆ సమయంలో లంబోదరుడు అనే పేరు వచ్చింది. విశ్వాన్నంతటినీ తన కడుపులో దాచుకొన్న కారణంగా కూడా లంబోదరుడు అనే పేరు స్థిరపడింది. గణపతికి ఉండే చేటలంత చెవులు భక్తుల మనస్సులలోనూ, జీవితాలలోనూ ఉండే సకల విఘ్నాలను చెరిగేస్తాయనే అర్థంలో ఈ పేరు స్థిరపడింది. గజముఖస్వరూపతో ఉంటాడు కనుక గజవక్త్రుడు, గజాననుడు అనే పేర్కొచ్చాయి. ఆయనను పూజిస్తే సకల విఘ్నాలు తొలగిపోతాయనుకొని నమ్మిక. అందుకే ఆయనను కొలుస్తుంటారు.

# మోడీ పాలనలో పెరిగిన నిరుద్యోగం!



న్యూఢిల్లీ,భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతూనే ఉంది, ప్రపంచంలో అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఏర్పడుతుందని, ఉపాధి కల్పన పెరిగిందని మోడీ ప్రభుత్వ ప్రచారం ఎంత బూటకమో దేశంలో పెరిగిన నిరుద్యోగం, తగ్గిన ఉపాధిని గమనిస్తే తెలుస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) భారతదేశ ఉపాధి నివేదికను 2024న విడుదల చేసింది. 20002024 వరకు నిర్వహించిన సర్వేల ద్వారా భారత ప్రభుత్వ, రిజర్వు బ్యాంకు లెక్కలను, జాతీయ నమూనా సర్వేను, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ సర్వేలను ఉపయోగించి ఈ నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 2022లో ఉత్పత్తిలో శ్రామికుల వినియోగం (ఎల్ఎఫ్పిఆర్) 59.8 శాతంగా ఉంటే భారత దేశం 55.2 శాతంగా ఉంది. భారతదేశం పని చేయగల వయస్సు (15 నుంచి 59 సం) జనాభా 2011లో 59 శాతం ఉండగా, 2022 నాటికి 63 శాతం పెరిగింది. శ్రామికశక్తి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి లభించటం లేదు. కొద్ది మందికే పని దొరికిందని నివేదిక.స్వయం ఉపాధి విభాగం విడుదల చేసిన జులై 2022 నుంచి జులై 2023 వరకు మోడీ ప్రభుత్వంలో అత్యంత వినాశకర ఉపాధి తీరు వెల్లడైంది. దేశం మొత్తం ఉపాధిలో 58% స్వయం ఉపాధి పొందుతున్నారు. 2017 -18లో వీరు 52% మాత్రమే ఉన్నారు. దీన్ని గమనిస్తే ప్రభుత్వం కల్పించే ఉపాధి లేక ప్రజలు స్వయం ఉపాధిని ఆశ్రయించటం ఎక్కువైంది. స్వయం ఉపాధి పొందుతున్నవారు చిన్నవ్యాపారులు, చేతి వృత్తిదారులే. ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పిన దాని ప్రకారం స్వయం ఉపాధి కార్మికుల సంఖ్య 2017- 18లో 4 కోట్ల మంది ఉండగా, 2022- 23 నాటికి 9 కోట్లు, 50 లక్షలకు పెరిగింది. 92 దేశాలు అనుసరిస్తున్న అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచించిన పద్ధతి ప్రకారం జీతం చెల్లించిన ఇలాంటి వారికి ఉపాధి పొందిన కార్మికులు ఇవ్వటం లేదు. దీన్ని గమనిస్తే ఉపాధి కల్పనలో ఎంతగా మోడీ ప్రభుత్వ వైఫల్యం చెందింది. దేశంలో వ్యవసాయ రంగం ద్వారానే ఇప్పటికీ ఎక్కువగా ఉపాధి దొరుకుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) నివేదిక 38వ రౌండ్ (9183) నివేదిక ప్రకారం 77% గ్రామీణ కుటుంబాలు జీవనోపాధిని కొనసాగించడానికి వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నాయి.201819కి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే తాజా నివేదిక ప్రకారం వ్యవసాయంపై గ్రామీణ కుటుంబాలు ఆధారపడటం 53 శాతం తగ్గింది. జాతీయ జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 43% నుంచి 16 శాతం తగ్గింది. అందుకు కారణం సేద్యపు ఖర్చులు పెరగడం, పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలు లభించకపోవటం, వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయం చాలకపోవటం, అప్పుల పాలు కావడం వల్ల రైతులు వేరే ఉపాధి చూసుకోవటం వల్లనే. ఇదే గమనించాల్సిన అంశం ఒకటుంది. అది మహిళల వ్యవసాయ ఉపాధి రేటు ఇప్పటికీ 82 నుండి 72 శాతం మాత్రమే తగ్గింది. వ్యవసాయ పనులైన నాట్లు, కోత, కలుపుతీయటం, విత్తనాలు వేయడం మొదలైన పనుల్లో మహిళల పాత్ర ఎక్కువగా ఉంది. మహిళల ఉపాధి కూడా కొద్ది మేర తగ్గడానికి కొన్ని భాగాల యంత్రాల వినియోగంతోపాటు ప్రకృతి సృష్టిస్తున్న కరవు, వరదలు కూడా వ్యవసాయ రంగంలో ఉపాధి తగ్గడానికి కారణం. వీటిని గమనించినప్పుడు గ్రామీణ ఉపాధికి వ్యవసాయమే ప్రధానంగా ఉండి గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది.మరో ముఖ్యమైన విషయం కూడా గమనించాల్సిన అవసరం ఉంది. 2000 నుంచి 2012 వరకు వ్యవసాయంలో ఉపాధి పొందే వారి వాటా స్వల్పంగా తగ్గినా, కోవిడ్ కాలంలో వ్యవసాయ రంగమే ఎక్కువ ఉపాధి కల్పించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం పట్టణాలకు, నగరాలకు వలసలు వెళ్లిన పేదలు కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయి తిరిగి గ్రామీణ ప్రాంతాలకు వచ్చినప్పుడు వారు వ్యవసాయ రంగం ఆదుకున్న వాస్తవాన్ని గ్రహిస్తే వ్యవసాయ రంగ ప్రాముఖ్యత తెలుస్తుంది. 2011లో శ్రామిక జనాభా 61%గా ఉంటే, 2024లో 64 శాతంగా ఉంది. యువత ఉపాధి 37 శాతం క్షీణించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజా వివరాల ప్రకారం మే 2024లో నిరుద్యోగం 7 శాతం కాగా, జూన్ 2024లో 9.2% కి పెరిగింది. కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్ హోల్ సర్వే ప్రకారం జూన్ 2024లో మహిళా నిరుద్యోగం 18 శాతం చేరింది. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ.2023లో మహిళా నిరుద్యోగులు 15 శాతంగా ఉన్నారు. కార్మిక శక్తి వినియోగం 2024 మేలో 40.8% ఉంటే, జూన్‌లో 41.4 పెరిగింది. పట్టణ నిరుద్యోగం మే 2024లో 6.3 శాతం ఉంటే, జూన్‌లో 8.9 శాతం పెరిగింది. భారతదేశ ఉపాధి నివేదిక 2024 ప్రకారం నిరుద్యోగ శ్రామిక శక్తిలో దాదాపు 83% యువత ఉంది. మొత్తం నిరుద్యోగ యువత మాధ్యమిక లేక ఉన్నత విద్య పూర్తిచేసిన యువకుల వాటా 2000 సంవత్సరంలో 32.2% ఉంటే 2022లో 65.7% కి పెరిగింది. మోడీ ప్రభుత్వం ఉద్యోగ కల్పన కల్పించకుండా పోగా ఉన్న ఉద్యోగాల్లో కూడా తగ్గింది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. దేశం మొత్తంమీద ఉన్న 389 ప్రభుత్వ రంగ సంస్థల్లో 2014లో 16.9 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2022లో ఈ సంఖ్య 14.6 లక్షలకు తగ్గింది. ఒక్క బిఎస్ఎన్ఎల్‌లోనే గత 9 సంవత్సరాల్లో లక్ష 81వేల మందిని ఇంటికి పంపింది. ఈ విధంగా మోడీ ప్రభుత్వ పాలనలో ఉపాధి తగ్గి నిరుద్యోగం పెరిగింది.

## తప్పిన వాయుగండం ముప్పు

విశాఖపట్నం, నాలుగు రోజుల క్రితం కురిసిన అతి తీవ్ర వర్షాలతో ముంచెత్తిన వరదల ప్రభావంతో అతలాకుతలం అయిన ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం వాతావరణ కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఏపీకి వాయుగుండం ముప్పు తప్పిందని వెల్లడించింది. దీంతో ఏపీ వాసులు ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. కాగా మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, ఇది ఉత్తర దిశగా పయనిస్తోందని తెలిపింది. 9వ తేదీ నాటికి ఇది ఒడిశా- పశ్చిమ బెంగాల్ తీరాలకు అనుకోని వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పింది. వాయుగుండం ముప్పు తప్పినప్పటికీ రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర జిలాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అప్రమత్తం చేసింది. అల్లూరి, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షాలు అవకాశం ఉందని హెచ్చరించింది. శనివారం ఏలూరు, శ్రీకాకుళం, అల్లూరి పార్వతీపురం జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

# భారతీయులను ఏకం చేసిన వినాయక చవితి

హైదరాబాద్,స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు వినాయక నవరాత్రలను బాగా ఉపయోగించు కున్నారు. ప్రజలను భక్తిభావంతో ఏకం చేసి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా నడిపించారు. ఇందులో భాగంగా ఇంటికే పరిమితమైన గణపతి పూజను నవరాత్రులుగా మలిచిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్ సొంతం. బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధాన్ని ధిక్కరించేందుకు, దైవభక్తికి దేశభక్తిని జోడించిన అపురూప సందర్భం గణపతి నవరాత్రులు. వలస పాలనలో వివక్షకు లోనవుతున్న భారతీయ సంస్కృతి, సంప్రదా యాలను పునరుద్ధరించేందుకు తొమ్మిది రోజుల వేడుక ఒక ప్రత్యేక సందర్భం. జాతీయోద్యమంలో భాగంగా మహారాష్ట్ర పుణెలో 1893లో లోకమాన్య తిలక్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తి భాగ్యనగరానికీ వ్యాప్తి చెందింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు గణపతి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశభక్తి, స్వాతంత్య కాంక్షను సామాన్యుల్లో రగిలించేందుకు, గమ్యం తెలియని బాటసారి లా అయోమయంలో ఉన్న యువతను ఒక సామాజిక లక్ష్యం దిశగా నడిపించేందుకు, 127 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సర్వ జనైక్య గణేశ్ ఉత్సవాలకు లోకమాన్య బాలగంగాధర తిలక్ పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రులను సామాజిక వేదికలుగా మలిచారు. ఆ జాతియోద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వ్యాపించింది. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన తిలక్ పిలుపుతో కొందరు భాగ్యనగరవాసులు ముందుకొచ్చారు. నగరంలో స్థిరపడిన కొందరు మహారాష్ట్రీయులు సామూహిక వినాయక పూజకు నాంది పలికారు. దాదాపు 125 ఏళ్ల క్రితం అలా హైదరాబాద్‌లోని గణపతి ఉత్సవాల శోభ ప్రారంభమయ్యింది. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు తొలిసారిగా పాతబస్తీలోని శాలిబండ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి. కొందరు మరాఠాలు 1895లో గణేశ్ ఉత్సవాలను సామూహికంగా నిర్వహించడం ప్రారంభించారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. 1895, మార్చి 27న శాలిబండలో ఉగాది పర్వదినం రోజున భారత గుణవర్ధక్ సంస్థను స్థాపించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మహారాష్ట్రీయులైన బాలచంద్ర దీక్షిత్, వక్రతుండ దీక్షిత్, నారాయణరావు పిల్‌ఖానె, లక్ష్మణరావు సదావర్తె, దాదాచారి కాలె తదితర మిత్ర బృందం సారథ్యంలో మరికొందరి స్థానిక కాయస్తులు, వ్యాపారవేత్తల సహకారంతో ఆ మరాఠా సంస్థను నెలకొల్పారు. అప్పటి నుంచి కులమతాలకతీతంగా అందరూ కలిసి గణపతి మండపాలను నెలకొల్పడం, తద్వారా రాజకీయ చర్చలు, స్వాతంత్య స్ఫూర్తిని యువతలో ప్రేరేపించే సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రతువుకు శ్రీకారం జరిగింది. ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు నేటికీ గణేశ్ నవరాత్రి వేడుకలను కొనసాగిస్తున్నారు. అప్పట్లో చెరువుల్లోని నల్లమట్టినే వినాయక ప్రతిమల తయారీకి వాడేవారు. చవితినాడు మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. సాయంత్రం వేళల్లో 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జానపద



నృత్యాలు, గీతాలాపన, భక్తి కీర్తనలు, భజన, పారాయణం, పద్య, ఇతిహాస నాటకాలు, సంగీత కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వచ్చేవారు. ఆ పూజా కార్యక్రమాలు, కళా ప్రదర్శనలే దేశ సమైక్యతకు స్ఫూర్తిగా నిలిచేది. అలాంటి పరిస్థితులలోనూ నిజాం ప్రభుత్వం సమ్మతించేలా గణపతి నవరాత్రులు నగరంలో జరగడం విశేషం. ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు కుటుంబంతో సహా వెళ్లేవాళ్లం. రెండు కళ్లు చాలవు అన్నంతగా సంబరాలు జరిగేవి. పదో రోజు తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు అంతా కలిసి మట్టి గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లి మూసీలో నిమజ్జనం చేసేవాళు. అలా మొదలైన ప్రస్థానం ఇప్పుడు ఊరూవాడా విస్తరించింది. ఛత్రపతి శివాజీ పరిపాలనా సమయంలోనే మరాఠా రాజ్యంలో వినాయక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని కొందరు చరిత్రకారులు అంటారు. వినాయకుడిని పీష్వాలు తమ కులదేవుడిగా ఆరాధిస్తారు. కనుక 17వ శతాబ్దంలో శివాజీ చేతుల మీదుగా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయని కొందరి అభిప్రాయం. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా లోకమాన్య తిలక్ శివాజీ ఉత్సవాలు, గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని చారిత్రక అధ్యయనకారులు చెబుతారు. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లు వేలంపాట ద్వారా దక్కించుకోవడం అందుకు తార్కాణం. అంతేకాదు, చార్మినార్ తదితర ప్రాంతాలలో గణపతి శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు ఎదురెల్లి భక్తులకు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో ఉన్నాయి. అలా నగరంలో వినాయకచవితి జోష్ నెలకొంది. రోడ్ల నిండుగా విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ తరవాతే లడ్డూ వేలాలు మొదలయ్యాయి. బాలాపూర్, ఖైరతాబాద్ ప్రసిదిద్దికెక్కాయి.

## హరియాణా ఎన్నికల వేళ కీలక పరిణామం

న్యూఢిల్లీ, హరియాణా ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేతల సమక్షంలో వీరిద్దరూ హస్తం కండువా వేసుకున్నారు. దీనికి ముందు ఈ రెజ్లర్లు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. మరోవైపు, పార్టీలో చేరడానికంటే ముందే.. భారత రైల్వేలో తమ ఉద్యోగాలకు వినేశ్, పునియా రాజీనామా చేశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఇటీవల భేటీ అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిపిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం వినేశ్ ఫొగాట్, బజ్‌రంగ్ పునియా. కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. ఆ ఫొటోను కాంగ్రెస్ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది. దాంతో వారు కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమంటూ వచ్చిన వార్తలు.. తాజాగా నిజమయ్యాయి. ఇదిలాఉంటే.. నేడో, రేపో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశాలున్నాయి. అందులో వీరికి టికెట్లు దక్కే సంకేతాలు కన్పిస్తున్నాయి. అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒలింపిక్స్ కల చెదిరింది. దాంతో ఆమె భవిష్యత్తు ప్రయాణంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల ఆమె ఒలింపిక్స్ ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సమయంలో.. ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ (అనీనిణస।బబ) ఎంపీ దీపిందర్ హుడా ఆమెకు స్వాగతం పలికారు. అంతకుముందు కూడా వినేశ్‌ను రాజ్యసభకు పంపాలంటూ కొంతమంది కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పలువురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో జరిగిన ఆందోళనల్లో వినేశ్, పునియా కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గత హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో భాజపా (ఃఏఖ)లో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె.. ఓటమి పాలయ్యారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు అదే స్థానం నుంచి వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. ఈ రాష్ట్రంలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెల్లడికానున్నాయి.

## చేతలకు చాలా తేడా

హైదరాబాద్,డబుల్ ఇంజన్ సర్కార్ కావాలి..తెలంగాణలో తదుపరి తమదే ప్రభుత్వం అంటున్న బిజెపి.. ప్రజలకు సేవలు అందించడంలో...వారి కష్టాల్లో పాలు పంచుకోవడంలో మాత్రం శ్రద్ద చూపడం లేదు. కేవలం పడికట్టు పదాలు, గంభీర ఉపన్యాసాలతో కాలం గడిపేస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ అతలాకుతలం అయ్యింది. అయినా పెద్దగా స్పందించలేదు. ఇంతకన్నా దారుణం, ఘోరం మరోటి ఉండదు. ఒక్కరు కాదు...ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. మరో ఆరుగురు ఎంపిలు ఉన్నారు. ప్రజలు వారిని నమ్మి గెలిపించారు. ఇలాంటి విపత్కర సమయంలో మేమున్నామని ముందుకు రాకపోవడం, అదంతా కాంగ్రెస్ తప్పిదమన్న రీతిలో మాట్లాడుతున్నారు. కేంద్రం నిధులు ఉన్నాయి...ఖర్చు పెట్టుకోండని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఓ ఉచిత సలహా పడేశారు. ఇకపోతే తెలంగాణ భారతీయ జనతా పార్టీ నాయకులు అసలైన విషయాలపై స్పందించడం లేదు. ముఖ్య నేతలంతా ఎవరికి వారే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ పరిమామం వల్ల అసలు బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. తాజాగా వరదల విషయంలో కేందాన్ని కాంగ్రెస్ పార్టీ పదేపదే సాయం కోరుతోంది. ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసింది. అవసరమైన హెలికాప్టర్లు, పవర్ బోట్లు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించలేదని ప్రజల్ని గాలికి వదిలేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీటిని తెలంగాణ బీజేపీ నేతలు కూడా తిప్పికొట్టలేకపోతున్నారు. మామూలుగా అయితే సాయం చేసి విమర్శలపై ఎదురుదాడి చేయవచ్చు . కానీ ఎవరికి వార తమకెందుకులే అనుకుంటున్నారు. అందు వల్లే ఎవరూ ముందుకు రావడం లేదు. ఖమ్మంకు ఆ స్థాయిలో వరద వస్తుందని ప్రభుత్వం ఊహించలేకపోయింది. బుడమేరు విజయవాడను ముంచింది కాబట్టి... ఆ నీరు ఖమ్మం వైపు వస్తుందని అంచనా వేయలేకపోయారు. చివరికి మున్నేరు పెద్ద ముప్పు తెచ్చి పెట్టింది. ఆరేడు అడుగుల ఎత్తున నీరు పారడం అంటే చిన్న విషయం కాదు. మామూలుగా అయితే గోదావరికి వరదలు వస్తే.. ఖమ్మం జిల్లా ఉలిక్కి పడుతుంది. ఈ సారి మాత్రం అందుకు భిన్నంగ మున్నేరు ముంచేసింది. హెలికాప్టర్లు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం విమర్శలు ఎదుర్కో వాల్సి వచ్చింది. తర్వాత రోజే రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనకు వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రులు అక్కడే ఉండి సహాయ పునరావసా చర్యలు చేపట్టారు. అయినప్పటికీ.. ప్రభుత్వం పెద్దగా ఏమ చేయలేదన్న విమర్శలను మూటగట్టుకుంది. అదే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. విపత్తు వచ్చినా కేంద్రం కనీసం హెలికాప్టర్ల పంపలేదని.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపలేదని రుజువు అయ్యింది. పక్కన ఉన్న ఆంధ్రాకు 120 పవర్ బోట్లు, హెలికాప్టర్లు, ఎయిర్ ఫోర్స్ కూడా సాయానికి వెళ్లింది. కానీ తెలంగాణకు ఎంతమాత్రం సాయం అందలేదు. అది కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమేనని బీఆర్ఎస్ విమర్శించింది. ఇంత జరుగుతున్నా తమపై వస్తున్న విమర్శలకు బీజేపీ కౌంటర్ చేయలేకపోతోంది. దీనికి కారణం సమాధానం లేకపోవడం కాదు. నేతలు పెద్దగా పట్టించుకోకపోవడమే. తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఒక్క లీడర్ కూడా బాధ్యత తీసుకోవడం లేదు. మరీ ముఖ్యంగా వరద పరిస్థితుల్లో బిజెపి పూర్తిగా విఫలం అయ్యింది. కేవలం విమర్శలకే పరిమితం అయ్యింది. బిజెపిలోఎవరికి వారు సొంత ఎజెండా ప్రకారం స్పందించడం అలవాటు చేసుకున్నారు. అందుకే వారు కేంద్రాన్ని కూడా గట్టిగా నిలదీయడం లేదు.

## జలదిగ్బంధనంలో వనదుర్గా ఆలయం

మెదక్,మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గమాత ఆలయం ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నది. భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో సింగూరు ప్రాజెక్టు రెండు గేట్లను అధికారులు ఎత్తివేశారు. దీంతో ఏడుపాయల వనదుర్గ ప్రాజెక్టు పొంగుతున్నది. వరద ఉధృతికి ఆలయంలోకి నీరు చేరింది. గత ఆరు రోజులుగా ఆలయం నీట మునిగే ఉన్నది. ఈనేపథ్యంలో రాజగోపురంలో ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో వెల్లడించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి భారీగా వరద వస్తుండటంతో మంజీరా నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. వనదుర్గ ప్రాజెక్టువైపు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాగా, ఎగువ నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తింది.

# ముంబై ప్రాపర్టీ నుంచి లక్షల్లో అద్దె



న్యూఢిల్లీ,సెబీ ఛైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్‌పై మరోసారి సంచలన ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ముంబయిలో ఓ ప్రాపర్టీ నుంచి అద్దెగా రూ.లక్షలు పొందుతున్నారని పేర్కొంది. సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ సంస్థకు ఆ కార్యాలయం అనుబంధంగా ఉందని తెలిపింది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఛైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్‌పై కాంగ్రెస్ మరోసారి సంచలన ఆరోపణలు చేసింది. ముంబయిలో మాధవికి చెందిన ఓ ప్రాపర్టీని సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ సంస్థకు అ÷-దదెకి ఇచ్చినట్లు పేర్కొంది. దాన్నుంచి ఆమె ఆదాయం పొందుతున్నట్లు ఆరోపించిన కాంగ్రెస్.. ఇది అవినీతికి సంబంధించిన వ్యవహారమని దుయ్యబట్టింది. దీనిపై ప్రధాని మోదీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. 'ఇది కేవలం సొంత ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాదు. అవినీతికి సంబంధించిన కేసు. సెబీ సభ్యురాలిగా ఉన్న బుచ్.. ముంబయిలోని ఓ ప్రాపర్టీని 2018-19లో క్యారల్ ఇన్ఫో సర్వీసెస్ అనే సంస్థ అదదెకు ఇచ్చారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ సహా అనేక కేసుల్లో సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ కంపెనీకి క్యారల్ ఇన్ఫో అనుబంధ సంస్థగా ఉంది. ఆ రెండు కంపెనీల ప్రమోటర్లు కూడా ఒకరే. 2018-19 నుంచి 2023-24 వరకు అదదె రూపంలో మాధవీ మొత్తంగా రూ.2.16 కోట్లు పొందారు' అని మాధవీ పురి బుచ్‌పై కాంగ్రెస్ నేత పవన్‌ఖేడా అరోపణలు చేశారు. సెబీకి సమగ్రత, జవాబుదారీతనం పతనమైందనడానికి ఇంతకంటే ఏం ఆధారాలు కావాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ప్రధాని మోదీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. 2017 నుంచి 2021 వరకు సెబీ సభ్యురాలిగా ఉన్న మాధవి, 2022 మార్చి 2న సెబీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 2017లో ఆమె సెబీలో చేరినప్పటినుంచి, ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు అధికారి హోదాలో జీతభత్యాలు అందుకున్నారని తెలిపింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఐసీఐసీఐ బ్యాంకుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరుపుతూనే, అదే బ్యాంకు నుంచి ఆదాయం పొందారన్న విషయం ప్రధాని మోదీకి తెలుసా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. అయితే 2013 అక్టోబరు 31న బుచ్ పదవీవిరమణ చేసిన తర్వాత నుంచి ఆమెకు పదవీవిరమణ ప్రయోజనాలు మినహా ఎటువంటి వేతన చెల్లింపులు చేయలేదని ఐసీఐసీఐ బ్యాంక్ స్పష్టంచేసింది.

# వరదలతో దెబ్బతిన్న రాష్ట్రాలకు కేంద్రం చేయూత



హైదరాబాద్,ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలం అయిన తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కేంద్ర ప్రభుత్వం భారీ సాయం ప్రకటించింది. విపత్తు నిర్వహణ నిధి నుంచి రూ.3,448 కోట్లను కేంద్రం కేటాయించింది. తక్షణ సహాయం అందించడానికి పక్రియ జరుగుతోందని, ఈ నిధుల్లో కేంద్రం వాటా కూడా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో సంభవించిన వరదల సహాయ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇవాళ శుక్రవారం తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. సామాన్య ప్రజలు, రైతులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. అంతకు ముందు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో కూడా పర్యటించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సమర్థతతో పని చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటనలో శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరద నష్టం తీవ్రంగా ఉందని, తక్షణ సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరదల వల్ల సుమారు 5,438 కోట్ల నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచాన వేసినట్టు వివరించారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల విడుదల విషయంలో మార్గదర్శకాలను సడలించాలని కోరారు. సచివాలయంలో కేంద్ర మంత్రికి వరద ప్రభావం, నష్టాన్ని ముఖ్యమంత్రి, అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి సాయం చేస్తారో తెలంగాణకూ అదే స్థాయిలో చేయాలని, రెండు రాష్ట్రాలనూ ఒకే విధంగా చూడాలని సీఎం కోరారు. పలు జిల్లాల్లో ఒక్క రోజే 40 సెం.మీ వర్షంకురిసిందని, వరద ప్రభావిత జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉందని సీఎం చెప్పారు. రహదారులు, ఇళ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని.. రాకపోకలు స్తంభించాయని సీఎం తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని.. పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని వివరించారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఇవాళ తెలంగాణలో వరద నష్టంపై సచివాలయంలో కేంద్రమంత్రి శివరాజ్ చౌహాన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల సమావేశం ముగిసింది. రాష్ట్రంలో జరిగిన వరద ప్రభావిత ప్రాంతాల దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెం.మీ వర్షం కురిసిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వరద ప్రభావిత జిల్లాలోని గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని వివరించారు. ఇక రోడ్లు, ఇళ్లు, బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రాకపోకలు స్తంభించాయని ఆయన తెలిపారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ.10వేలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర పంట నష్టం జరిగిందని, పొలాలన్నీ రాళ్లు, ఇసుక మేటలతో నిండిపోయాయని అధికారులు పరిస్థితిని వివరించారు.

# కార్పోరేట్‌కు దీటుగా విద్యారంగం వృద్ధి చెందాలి



అమరావతి, ప్రభుత్వ విద్యా రంగాన్ని కార్పొరేట్‌కు దీటుగా మార్చాల్సి ఉంది. పాఠశాలల ముఖ చిత్రాన్ని మార్చి వేస్తామని ప్రకటించింది. సూచనల కోసం ఒక నిపుణుల కమిటీని ఉన్నత, పాఠశాల విద్యా వ్యవస్థల్ని పర్యవేక్షించేందుకు, ప్రైవేటు సంస్థల నియంత్రణకు పూనుకోవాలి. నిజానికి మన పాఠశాలలు కనీస వసతుల్లేవు. మన ప్రమాణాలు నానాటికి తీసికట్టుగా మారుతున్నాయి. గ్రామీణులు, పేదలు, కింది వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతికి సైతం చదువు భారంగా మారింది. ఊహించలేనంత అసమానతలు ఒకటో తరగతి నుంచే ఎదురవుతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న పథకాలు, సంస్కరణలు ఈ సమస్యల నుంచి మన పాఠశాల విద్యారంగాన్ని గట్టెక్కించగలిగితే అంతకు మించి ఆశయం మరోటి ఉండదు. పిల్లల చదువులు భారమైనందు వల్ల మన అక్షరాస్యత తక్కువగా వుంది. ప్రైవేటు చదువు మరీ భారంగా వుంది. సమస్యకు మూల కారణం ఊళ్లో బడి దివాళా తీయడం. కనీస వసతులు, చదువులు లేక ప్రజల్నించి దూరం గావడం. నిరుపేదలు కూడా ప్రైవేటును ఆశ్రయించడం. మన పాఠశాలల్ని చూడముచ్చటగా మార్చి వుంటే అద్భుతాలు జరిగేవి. రెండు మూడేళ్లలో వీటి రూపురేఖలే మారి పొయ్యేవి. మంచి చదువు పేద పిల్లలకూ దక్కేది. ఆ ఊరి పిల్లలు ఆ ఊరి బడి లోనే చదివే స్థితి వుంటే మన విద్యారంగం ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకొంటే ఇది తెలిసొస్తుంది. ప్రభుత్వ బడిని మార్చకుండా తల్లి దండ్రులకు నగదు ఇవ్వడం వల్ల మార్పు రాదని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామని 'నాడు-నేడు' పథకం తెచ్చినా మార్పు కానరాలేదు.. నిపుణుల కమిటీలన్నీ ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషా మీడియం వుండి తీరాలంటున్నాయి. నూతన విద్యా విధానం కూడా ఇదే చెబుతోంది. ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా ఇదే పేర్కొంది. కేంబ్రిడ్జి, అజీం ప్రేంజీ ఫౌండేషన్లు చేసిన పరిశీలనల్లో ఇంగ్లీషు మాధ్యమం తీవ్ర నష్టం తెచ్చిందని తేలింది. ఆంగ్ల మాధ్యమాన్ని మొండిగా ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు. మొదట మాతృభాషలో ప్రారంభించి ఒకానొక దశలో ఆంగ్లంలోకి మళ్లించాలని మాత్రమే చెబుతున్నారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో జరుగుతున్నదీ ఇదే! ఇంగ్లీషు మీడియం పెడితే మంచి చదువు చెప్పేసినట్లు అవుతుందనుకొంటుంది ప్రభుత్వం. ప్రస్తుత టీచర్లు దీనికెంత అర్హులన్న ప్రశ్న కూడా వుంది. పిల్లల చదువుల్ని మూల్యాంకనం చేసి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, మారుతున్న అవసరాలకు తగ్గ పాఠ్యాంశాలు రూపొందించి, శిక్షణలిచ్చి ఎప్పటికప్పుడు సృజనాత్మకంగా బోధనాభ్యసనాలు సాగేలా చూసే బాధ్యత ఎస్.సి.ఆర్.టి వారిది. జిల్లా విద్యా శిక్షణా సంస్థలది. ఉమ్మడి సర్వీసు నిబంధనల సాకుతో అన్ని పోస్టులు ఖాళీగా వున్నాయి. ఒక స్పష్టమైన దృక్పథం వుంటే మొదట దీనిపైన దృష్టి సారించాల్సి వుంటుంది. అన్ని స్థాయిల్లో బలమైన వ్యవస్థల్ని నిర్మించాల్సి వుంటుంది. వ్యవస్థలోని మరో బలహీనత ప్రజల్ని ఏ మాత్రం భాగస్వాముల్ని చెయ్యలేకపోవడం. బడిని ఒంటరిగా మార్చడం. పంచాయతీలకు, స్థానిక దాతలకు స్థానం లేకుండా పోవడం. నాడు-నేడు నిధుల్ని పాఠశాల విద్యా కమిటీలే వ్యయం చేసేలా ఉత్తర్వులిచ్చారు. ఉన్నత పాఠశాలల్ని గుర్తించి, అన్ని హంగులు కల్పించాలి. బలమైన అకడమిక్ వ్యవస్థను రూపొందించాలి. అధ్యాపకుల్ని నియమించి ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ప్రారంభించి దీనికి పూనుకోవాలి. ప్రస్తుత జూనియర్ కళాశాలల్ని, అందులోని రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల్ని ఎలా సర్దుబాటు చెయ్యాలో కూడా చర్చించాలి. మన ప్రాథమిక పాఠశాలలు కనీస వసతుల్లేని, ఒకటి రెండు గదుల్లో నడుస్తున్నాయి. వాటిలోకి పసి బిడ్డల్ని తేవడం వారికి రక్షణ కల్పించడం అంత సులవైనపనిగాదు.

# బుడమేరును మింగేశారు! ప్యాకేజీలుగా గుటుక్ మనిపించారు..



విజయవాడ:విజయవాడను వరద ముంచెత్తింది.. బుడమేరు సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. సాఫీగా సాగే బుడమేరు వరద వెనక్కి తన్నడం.. మూడు చోట్ల భారీ గండ్లు పడటంతో వరద నీరు కాలనీలను ముంచెత్తింది. ఈ వరదలకు గల ప్రధాన కారణాలేంటి అనే ప్రశ్నలు అందరిలో తలెత్తుతున్నాయి. బుడమేరు పోటెత్తడానికి గల కారణాలను అన్వేషిస్తే.. తవ్వినకొద్దీ టన్నులకు టన్నుల లోపాలు వెలుగుచూస్తున్నాయి. ఇదంతా గత వైఎస్సార్?సీపీ ప్రభుత్వం నిర్లక్ష్యమేనని తెలుస్తోంది. అప్పట్లో ఆ పార్టీ లీడర్లు చేసిన పాపాలు.. విజయవాడ ప్రజలకు శాపంగా మారాయి.

ప్యాకేజీల వారీగా పనులు..

డ్రైనేజీ డివిజన్‌లో 2011లో 5 ప్యాకేజీలుగా విభజించి రూ.72.50 కోట్లతో టెండర్లు పిలిచారు. 0 నుంచి 12 కిలోమీటర్ల వరకు రూ.16.15 కోట్లు, 12 నుంచి 25.60 కిలోమీటర్ల వరకు రూ.17 కోట్లు, 25 నుంచి 34 కిలోమీటర్ల వరకు రూ.12 కోట్లు, 34 నుంచి 43.50 కిలోమీటర్ల వరకు రూ.13 కోట్లు, 42.50 నుంచి 50.60 కిలోమీటర్ల వరకు రూ.14 కోట్లతో టెండర్లు పిలిచారు. 1,4,5 ప్యాకేజీలు రాఘవ కన్?స్ట్రక్షన్? సంస్థ, 2,3 ప్యాకేజీలు ఆర్ఎస్ఆర్ సంస్థ దక్కించుకున్నాయి.

పట్టించుకోని జగన్ ప్రభుత్వం

టెండర్లు దక్కించుకున్న సంస్థలు భూసేకరణ చేపడితేనే పనులు చేస్తామంటూ జాప్యం చేశాయి. మొదటి ప్యాకేజీ విజయవాడ సమీపంలో ఉంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న దీని భూసేకరణకు ?200 కోట్లు అవుతుందని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తొలుత 29.175 కిలోమీటర్ల వరకు 62 మీటర్ల బెడ్ విడ్త్‌తో వెడల్పు చేసి కట్టలు పటిష్ఠ పరచాలి. 29.825 కిలోమీటర్ల నుంచి 110 మీటర్ల వెడల్పు, తర్వాత 180 మీటర్ల వెడల్పు చేయాలి. ఈ డ్రెయిన్‌ని 417 క్యూమెక్కులు అంటే 15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా డిజైన్ చేశారు.

క్లాజ్ 60 సీ పేరుతో దోపిడీ..

కాగా, విస్తరణ పనులను జగన్? సర్కారు అటకెక్కించింది. క్లాజ్ 60సీ పేరుతోనూ, అదనపు పనుల పేరుతో నాన్ ఈపీసీ కింద మొత్తం ?28.91 కోట్లను గుత్తేదారులకు దోచిపెట్టింది. అసలు పనులను ముందస్తు ముగింపు పేరుతో అర్ధాంతరంగా ఆపేసి, గుత్తేదారు సంస్థలకు బిల్లులు చేసింది. 2,3,5వ ప్యాకేజీల్లో పనులు మొత్తం పూర్తి చేశారు. ఎనికేపాడు నుంచి ఉన్న మొదటి ప్యాకేజీలో గుత్తేదారు సంస్థ కేవలం 30శాతం పనులే పూర్తి చేసింది.

అసంపూర్తిగా నాలుగో ప్యాకేజీ పనులు..

నాలుగో ప్యాకేజీ పనులను 2020లోనే వైఎస్సార్?సీపీ ప్రభుత్వం అసంపూర్తిగా ముగించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు ఆ ప్యాకేజీల్లో కొంత పని దక్కించుకున్న నాస్‌బాబు సంస్థ చేపట్టిన 34 నుంచి 42.50 కిలోమీటర్ల వరకు 42.50 నుంచి 50.60 కిలోమీటర్ల వరకు ఉన్న పనులను ప్రీక్లోజర్ చేసేశారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు పనులు చేయకపోయినా గడువు పొడిగిస్తూ వచ్చారు. నిబంధనల ప్రకారం టెండర్లు ఒక సంస్థకు ఇచ్చినా క్లాజ్ 60సీ ద్వారా పనులు వేరే కాంట్రాక్టరకు అప్పగించొచ్చు.

పనులు చేయకుండానే బిల్లులు..

2019లో వైఎస్సార్‌సీపీ పెద్దలు ఈ క్లాజ్‌ని బయటకు తీశారు. దీంతో ఇంజినీర్లు 1, 4, 5 ప్యాకేజీ పనులను వేరే గుత్తేదారులకు అప్పగించారు. ఈ గుత్తేదారులు పనులు అసంపూర్తిగా వదిలేసినా తవ్విన మట్టిని విక్రయించేసుకున్నా మొత్తం బిల్లులు చెల్లించేశారు. నిబంధనల ప్రకారం ప్రతి కిలోమీటరు పూర్తి చేస్తేనే బిల్లులు ఇవ్వాలి. కానీ వైఎస్సార్?సీపీ పెద్దల సూచనతో వంద మీటర్ల మట్టి తవ్వినా బిల్లులు చేశారు. డ్రెయిన్ రెండు వైపులా తవ్వితేనే ఇవ్వాలి. కానీ ఒకవైపు తవ్వినా ఇచ్చేశారు. 2వ ప్యాకేజీలో వంకరటింకరగా ఉందని 5 కిలోమీటర్ల దూరం, 3 వ ప్యాకేజీలో 2 కిలోమీటర్ల దూరం వ్యత్యాసం ఉందని అదనపు టెండర్లు పిలిచారు.

చక్రం తిప్పిన గన్నవరం లీడర్..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి గన్నవరం ప్రజాప్రతినిధి చక్రం తిప్పి నాన్ ఈసీసీ కింద గుత్తేదారులను సిండికేట్ చేయించి తమవారికి దక్కేలా చేసినట్టు తెలుస్తోంది. 12 నుంచి 17.6 కిలోమీటర్ల దూరం వరకు మెలికలుగా ఉందని, ?8 కోట్లు అదనంగా కేటాయించి, ఓ గుత్తేదారుకు అప్పగించారు. గన్నవరం సమీపంలో ఈ పనుల్లో వచ్చిన మట్టిని విచ్చలవిడిగా అమ్ముకున్నట్టు సమాచారం. ఇటు ఈ ?8 కోట్లు, అటు ఆ మట్టి విక్రయాలతో గుత్తేదారు అందినకాడికి దోచేశారు. 25 నుంచి 26.8 కిలోమీటర్ల వరకు పనులను ?1.20 కోట్లకు అప్పగించారు.

బుడమేరు పరిధిలో ఆక్రమణలు..

మరోవైపు 5వ ప్యాకేజీలో రెండు పాయలుగా ఉండే బుడమేరు మధ్యలో నేతల అండతో పట్టా భూములను ఆక్రమించి చేపలు, రొయ్యల చెరువులు తవ్వేశారు. దీంతో కొల్లేరులో కలవాల్సిన ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు ఏర్పడి పంట పొలాలు మునిగిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పాఠశాలల్లో గ్రంధాలయాను విస్తరించాలి



హైదరాబాద్,పుస్తకం హస్తభూషణం అన్నారు. ఇంటర్‌నెట్,స్మార్ట్ ఫోర్ మాయలో పడి మనం అంతా పుస్తక పఠనాన్ని మర్చి పోయాం. ప్రతిదీ గూగుల్ చూసిపెడుతుందన్న భావనలో ఉన్నాం. కానీ పుస్తక పఠనంతోనే మస్తిష్కం వికసిస్తుంది. మనం మరచిపోతున్న ఈ అలవాటును జ్ఞప్తికి చేసుకునేలా పుస్తక ప్రదర్శనలు ఉపయోగపడుతున్నాయు. అక్కడక్కడా ఏర్పాటు చేస్తున్న బుక్‌ఫెయిర్‌లు మళ్లీ ఆనదదాన్ని నింపుతున్నాయి. ఆసక్తిని పంచుతున్నాయి. డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతుంది. అక్షరాభ్యాసంతో ఆరంభమయ్యే ఈ అభిరుచి నిరంతరం నిరాఘాటంగా కొనసాగించాలి.పుస్తకాలు ప్రియమైన నేస్తాలు. డిజిటల్ యుగం లోనూ పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంటుంది. పుస్తకం ఒక విజ్ఞాన భాండాగారం. ఎప్పటికప్పుడు మన అవగాహనను పెంచుకోవడానికి అది అందించే విజ్ఞానం ఉపకరిస్తుంది. విజ్ఞానాన్ని పెంచుకోవడంతో బాటు, మనలో మనల్ని తెలుసుకునేలా చేస్తుంది. పుస్తకం మనచుట్టూ ప్రపంచాన్ని మనం తెలుసుకునేలా చేసే అపురూప సాధనంగా చూడాలి. అంతర్లీనంగా పుస్తకం అందించే విజ్ఞానం మన సామాజిక జీవనాన్ని నిర్దేశిస్తుంది. ఎన్నిపుస్తకాలు చదివితే అంతగా విజ్ఞానం అబ్బుతుంది. అందువల్ల పుస్తక ప్రియులు ఎలాగూ పఠనం చేస్తారు. ఆ అలవాటు లేనివారు సైతం అలవాటుచేసుకుంటే తమజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారు. అందువల్ల పాటశాల స్థాయిలోనే రకరకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. పుస్తకాల పఠనంపై ఆసక్తి తగ్గడంతో ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. అంతెందుకు స్కూళ్లలో కూడా గ్రంథాలయాలు అతంంతగానే ఉంటున్నారు. పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర గ్రంథాలు అందు బాటులో ఉండడం లేదు. రెఫరెన్స్ పుస్తకాలు కూడా దొరకడం లేదు. డబ్బుండి కొనుక్కునే వారికి తప్ప పుస్తకాలు లేక లైబ్రరీలు నిరసించి పోతున్నాయి. అంతకుమించి నేటి విద్యార్థుల్లో పఠనాసక్తి తగ్గుతోంది. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వ కళాశాలలు తగ్గడం, సామాజిక శాస్త్రాలు చదివిన వారికి తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల ఆ శాస్త్రాలపై నేటి యువత మొగ్గుచూపటం లేదు. తద్వారా సమాజంతో బంధానికి దూరమౌతున్నారు. పాఠశాలల్లో ఒకప్పుడు లైబ్రేరియన్లు వుండేవారు. ఇప్పుడు ఆ పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా విద్యాలయాల్లో విద్యార్థులకు పాఠశాలల్లో లభిస్తున్న పుస్తకాలపై అవగాహన కలగడం లేదు. ఇటువంటి పరిస్థితులలో సాహితీవేత్తలు, భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు గ్రంథాలయ ఉద్యమాలు వంటివి మరోసారి ప్రారంభించాల్సిన అవసరం వుంది.ఈ రోజుల్లో పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా మారింది. పాలకుల నుండి కూడా పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. కేవలం పోటీ పరీక్షల కోసం ముద్రించే పుస్తకాలకు మాత్రమే డిమాండ్ ఉంటోంది. యువతలో ఎక్కువ మంది సినీ సాహిత్యానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'యునెస్కో' అంచనా ప్రకారం ప్రతి ఐదు వేల మందికి ఒక గ్రంథాలయం ఉండాలి. మన దేశంలో కేవలం 75 వేల గ్రంథాలయాలున్నాయనేది ఒక అనధికార అంచనా. గ్రంథాలయాల్లో పోస్టుల భర్తీ కూడా సక్రమంగా జరగడం లేదు. చాలా గ్రంథాలయాలను ఆధునీకరించడం లేదు. లైబ్రరీలలో పాత పుస్తకాలే దర్శన మిస్తున్నాయి. గ్రంథాలయ వారోత్సవాలని కూడా మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారు. ఆ రోజుల్లోనే అయ్యంకి రమణయ్య గ్రంథాలయాల అభివృద్ధికి పది ఎకరాల స్థలాన్ని దానం చేసి 'గ్రంథాలయ ఉద్యమ పిత' గా పేరు పొందారు. తెలుగు రాష్ట్రాల్లో పుస్తక మహోత్సవాలను హైద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, కర్నూలు వంటి ప్రముఖ పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మార్కెట్లో వచ్చే కొత్త పుస్తకాలపై అవగాహన ఏర్పడటం లేదు. పిల్లలకు కనీసం చదవడం, రాయడం వంటి విషయాలపై అవగాహన కల్పించాలని ఎస్.సి.ఇ.ఆర్.టి ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటువంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. అసెంబ్లీ నియోజక వర్గాల్లో కూడా చిన్న, చిన్న పుస్తక మహోత్సవాలను నిర్వహించి స్థానిక రచయితలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సాహిత్యాన్ని పరిపుష్టం చేయవచ్చు.

# ఆ ముగ్గురే అర్ధరాత్రి వరకూ వేధించారు



నా ఆధారాలన్నీ సీజ్ చేశారు

విజయవాడ: తనపై తప్పుడు కేసు పెట్టి, అరెస్టు చేసి వేధించిన వ్యవహారంలో అప్పటి సీపీ కాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, నిఘా విభాగాధిపతి సీతారామాంజనేయులు కీలక వ్యక్తులని బాలీవుడ్ నటి కాదంబరి జత్వానీ విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె గురువారం రాత్రి విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. దర్యాప్తు అధికారి ఏసీపీ స్రవంతి రాయ్‌ను కలసి ఫిర్యాదు పత్రాన్ని అందించారు. వైఎస్సార్సీపీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా తనపై కేసు పెట్టి, తన తల్లిదండ్రులను అరెస్టు చేశారని వాపోయారు. విద్యాసాగర్‌తో పోలీసు ఉన్నతాధికారులు కుమ్మక్కై ఫోర్జరీ పత్రం సృష్టించి తప్పుడు కేసు నమోదు చేశారని కాదంబరి పేర్కొన్నారు.

ఆ కేసు వెనక్కి తీసుకోవాలనే..

పారిశ్రామికవేత్తపై తాను పెట్టిన అత్యాచారం కేసును వెనక్కి తీసుకునేలా చేసేందుకే ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో కేసు నమోదు చేశారని జత్వానీ చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే ఆగ మేఘాలపై ముంబయి వచ్చి తనతో పాటు తల్లిదండ్రులనూ అరెస్టు చేయడం కుట్రలో భాగమే అన్నారు. పోలీసు కస్టడీలో తనను ఉదయం 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 వరకు సుదీర్ఘంగా విచారించారనీ, ముంబయిలో కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరించారని ఆరోపించారు. విద్యాసాగర్‌ను వెంటనే అరెస్టు చేసి, తనకు, తన కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరారు. కమిషనర్ కార్యాలయం వెలుపల కాదంబరి మీడియాతో మాట్లాడారు '17 క్రిమినల్ కేసులు ఉన్న కుక్కల విద్యాసాగర్‌కు వైఎస్సార్సీపీ నేతలు ఎందుకు మద్దతుగా నిలుస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అటువంటి వ్యక్తి నాపై ఆరోపణలు చేయడం తగదు. నన్ను, నా కుటుంబాన్ని నాశనం చేసి పబ్బం గడుపుకోవాలని విద్యాసాగర్ చూస్తున్నారు. ఇటువంటి దారుణ పరిస్థితుల నుంచి వీలైనంత త్వరగా బయటపడాలని కోరుకుంటున్నా. దీనికి రాజకీయ రంగు పులమడం అన్యాయం. కొందరు పోలీసు ఉన్నతాధికారులు పరిధి దాటి వ్యవహరించడంతో వారిపై ఫిర్యాదు ఇచ్చా.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com